"తిరుమల క్షేత్రదర్శిని" గ్రంథమాల

# తిరుమల దివ్యతీర్థాలు

రచన

ప్రొ॥ సి. లలితారాణి

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2015

# TIRUMALA DIVYATHIRTHALU

*By*
**C. Lalitharani**

T.T.D. Religious Publications Series No.1184
© All Rights Reserved

First Edition : 2015

Copies: 3000

*Published by :*
**Dr. D. Sambasiva Rao**, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

*D.T.P.*
Office of the Editor-in-Chief
T.T.D., Tirupati

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

## ముందుమాట

**"వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన
వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి"**

వేంకటాద్రికి సమానమైన మరో క్షేత్రం ఈ బ్రహ్మాండంలోనే లేదు. వేంకటేశ్వరునికి సాటి రాగల దేవుడు ఇంతవరకు ఎక్కడా లేడు. ఇక మీదకూడ ఉండడు – అని అర్థం.

కలియుగవైకుంఠంగా భాసిల్లే శ్రీవేంకటాద్రిపై అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి అవతరించి నిత్యమూ భక్తులకు దర్శనమిస్తూ వారిని తరింపజేస్తున్నాడు. శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహమూర్తిని ఒక్క క్షణకాలమైనా దర్శించుకొని తరించడానికి వేలకొద్దిమంది భక్తులు నిత్యమూ ఈ క్షేత్రానికి యాత్ర చేస్తుంటారు.

పిలిస్తే పలికే ప్రత్యక్షదైవమూ, కోరిన వరాలరాయడూ ఐన శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన ఈ క్షేత్రంలోని స్వామి దివ్యమంగళ విగ్రహం, స్వామి పుష్కరిణి, పవిత్రతీర్థాలు, స్వామికి అతివైభవంగా జరిగే నిత్యకైంకర్యాలు, స్వామి బ్రహ్మోత్సవాలు మొదలైన విశేషాలు భక్తులకు తెలియజేయాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం **'తిరుమల క్షేత్రదర్శిని'** అనే పేర ఒక గ్రంథమాలను ప్రారంభించి, ఆ యా పండితులచేత గ్రంథాలను రాయించి ప్రకటించాలని తలపెట్టింది.

ఈ గ్రంథాలలో ప్రస్తుతం డా॥ సి. లలితారాణి శర్మగారు రచించిన **'తిరుమల దివ్యతీర్థాలు'** అన్న ఈ గ్రంథాన్ని భక్తులకు అందజేస్తున్నాము. భక్తు లీ గ్రంథం ద్వారా తిరుమల లోని దివ్యతీర్థాల విశేషాలను గూర్చి వివరంగా తెలుసుకొని ధన్యత నొందుదురుగాక అని ఆకాంక్షిస్తున్నాము.

సదా శ్రీవారి సేవలో...

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.



# తిరుమల దివ్యతీర్థాలు

**శ్రీవైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీ తటే ।**
**రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్ ॥**

**ఉపోద్ఘాతం**

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని నివాసస్థానం తిరుమలై. తిరు అనగా శ్రీ, మలై అనగా పర్వతం. తిరుమలై అనే శబ్దం(శ్రీ శైలం) శ్రీ పర్వతమనే అర్థంలో ప్రయోగించారని[1] తెలుస్తుంది. క్రీ.శ 1వ శతాబ్దంనాటికే సంగమవాఙ్మయంలో సుప్రసిద్ధమైన లక్షణగ్రంథం తొల్కాప్పియమ్. దక్షిణాన కన్యాకుమారి నుండి ఉత్తరాన తిరువేంగడంవరకు తమిళదేశమని తొల్కాప్పియం పేర్కొంటుంది[2].

క్రీ.శ. ఎనిమిదో శతాబ్దంలో ఇళంగో అడిగళ్ 'శిలప్పదికారం'లో తిరుపతి క్షేత్రాన్ని ఎక్కువగా వివరించాడు.

మధ్యయుగంలో పన్నిద్దఱాళ్వార్లలో పది మంది శ్రీవేంకటేశ్వరుని తమ రచనలైన దివ్యప్రబంధాలలో స్తుతించారు.

ఋగ్వేదం దశమమండలంలో వేంకటగిరి ప్రస్తావన ఉందని పెద్దల అభిప్రాయం[3].

---

1. Ramesan. w. The Tirumala Temple Page 1
2. తిరు వేంగడం టెన్కుమరి అయిడై తమిళ్ కూరుం నల్లులహం.
3. అరాయి కాణే వికటే గిరిం గచ్ఛ సదాऽన్వే ।
శిరింబిఠస్య సత్త్వభిః తేభిష్ట్వా చాతయామసి॥ (ఋ.సం. 10.155.1)

బ్రహ్మాండ-ఆదిత్యపురాణాలు వేంకటాద్రితో సమానమైన స్థానం ఈ బ్రహ్మాండంలోనే లేదని వేంకటేశ్వరునితో సమానమైన దేవుడు, ఇంతవరకు లేడు ఇకముందు కూడ ఉండబోడని ప్రతిపాదిస్తున్నాయి[4].

కలియుగ ప్రత్యక్ష దైవమని ఏడుకొండలవాడని సుప్రసిద్ధమైన భగవాన్ శ్రీనివాసుడు ఆర్తత్రాణపరాయణుడు. ఆయన నివాసస్థానమైన తిరుమల క్షేత్రం పరమపవిత్రమైన తీర్థరాశికి నిధానం. తిరుమలలోగల దివ్య తీర్థాల ప్రభావం ఏ యే పురాణాలలో ఎలా వర్ణించారో సమీక్షించడం ఈ చిన్న పుస్తకం యొక్క ప్రధానోద్దేశం.

**సప్తగిరులు**

'తిరుమల' (వేంకటాద్రి) సప్తగిరులు అని జగత్ ప్రసిద్ధమైన పర్వత పంక్తిలో ఉన్న కొన్ని పర్వతాలు తెలుగులో ఏడుకొండలని, సంస్కృతంలో సప్తగిరులని వ్యవహారం ఉంది. ఈ కొండల(పంక్తిని) పేర్లని పురస్కరించుకొని శ్రీనివాసునికి కొండలరాయడని, ఏడుకొండలవాడని, సప్తగిరి నాథుడని పేర్లు ఏర్పడినాయి. తిరుమలకు కాలిబాటన నడచివెళ్ళే భక్తులంతా "ఏడుకొండలవాడా! వేంకటరమణా! గోవిందా! గోవిందా!" అని ఎలుగెత్తి స్వామినామాన్ని కీర్తనచేయడం మనం వింటూనే ఉంటాం. ఈ స్వామికి ఏడుకొండలవాడనే ప్రసిద్ధి ఎప్పటి నుంచి వచ్చిందనే విషయంలో కచ్చితమైన సాక్ష్యాధారాలు కనపడవు. ప్రత్యేకంగా ఏడు కొండలను గురించి వాటి ప్రసిద్ధిని గురించి ఇక్కడ సంగ్రహంగా పరిశీలిద్దాం-

వాఙ్మయంలో ఏడుకొండల పేర్లు మనకు మొట్టమొదట శ్రీవేంకటేశ్వర సుప్రభాతంలో దొరుకుతున్నాయి. ఆ శ్లోకం-

4. వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి. బ్రహ్మాండ॥ (1.24 ఆ.పు. 1.5)



**శ్రీశేషశైల గరుడాచల వేంకటాద్రి**
**నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రిముఖ్యామ్ ।**
**ఆఖ్యాం త్వదీయ వసతేరనిశం వదంతి**
**శ్రీ వేంకటాచలపతే! తవసుప్రభాతమ్ ॥**

ఇందులోని భావం -

ఓ వేంకటాచలపతీ ! నీకు నివాసమైన తిరుమలను, శేషశైలమని, గరుడాచలమని, వేంకటాద్రి అని, నారాయణాద్రి అని, వృషభాద్రి అని, వృషాద్రి అని అనేక విధాలుగా భక్తులు పిలుస్తున్నారు. నీకు సుప్రభాతమైంది మేలుకో! స్వామి !

మనవాళమహామునిగా పేరుగాంచిన రమ్యజామాత్రుముని ఆస్థాన పండితులైన ప్రతివాద భయంకర అణ్ణంగరాచార్యులు గారు ఈ వేంకటేశ్వర సుప్రభాతాన్ని రచించారు. వీరు 14వ శతాబ్దానికి చెందినవారు. దీనిని బట్టి 14వ శతాబ్దినాటికే ఏడుకొండలు ప్రసిద్ధి చెందింది.

ఈ ఏడు కొండల గురించి సంగ్రహంగా తెలుసుకుందాం.

**శ్రీశైలం**

'తిరు' అనే తమిళ శబ్దానికి 'శ్రీ' అని అర్థం. 'మలై' అంటే కొండ అని అర్థం. 'తిరుమలై' అనే తమిళ పదానికి 'శ్రీశైలం' అని అర్థం. 'తిరుమలై' అనే తమిళ శబ్దం రాను రాను వ్యవహారంలో 'తిరుమల' గా మారింది.

ఈ పర్వతానికి శ్రీశైలమనే పేరేర్పడటాన్ని గురించి వరాహపురాణంలో ఇలా ఉంది

**శ్రీ ప్రదత్వాత్ శ్రియోవా సాచ్చబ్దశక్త్యా చ యోగతః ।**
**రూఢ్యా శ్రీశైల ఇత్యేవం నామ చాస్య గిరేరభూత్ ॥[5]**
**(వ.పు I .36. 34.)**

ఈ పర్వతం భక్తులకు శ్రీ ప్రదమైంది, శ్రీదేవికి నివాసమైంది కనుక దీనికి శ్రీశైలమనే పేరు ఏర్పడింది.

**శేషశైలం**

తిరుమలకే శేషశైలమని పేరు. దీనికీ పేరేర్పడడానికి రెండు కారణాలు కనిపిస్తున్నాయి.

శ్రీమహావిష్ణువు ఆదేశాన్ననుసరించి శేషుడు భూలోకంలో ఆ స్వామి విహారం కోసం ఈ పర్వతరూపాన్ని ధరించడంచేత దీనికి శేషశైలమనే పేరేర్పడిందని బ్రహ్మాండపురాణం చెబుతున్నది.[6]

ఇక రెండో కారణాన్ని బ్రహ్మ[7], భవిష్యోత్తరపురాణా లిలా వివరి స్తున్నాయి.

[8]శ్రీమహావిష్ణువు వాయువుకు శేషునికి పెట్టిన పందెంలో శేషుడు మేరుపర్వత పుత్రుడైన వేంకటాద్రిని ఆవరించగా వాయువు మహావేగంతో ఆ పర్వతంతో కూడా శేషుణ్ణి సువర్ణముఖరీ తీరానికి తీసుకొని వెళ్ళాడు. అక్కడస్వామి ఆజ్ఞతో వాయువు ఈ పర్వతాన్ని వదలి వేశాడు. శేషునివల్ల

5. వ.పు I.36. 34
6. అనంతోఽహం మహాదేవ స్థాస్యామి గిరిరూపధృక్ ।
భవతారమయా సార్థంమమ సానుషు రమ్యత్యాక్ ॥ (బ్రహ్మాపు 2.5)
7. సశేషగమనాచ్చాపి శేషాద్రిం ప్రాహురుత్తమాః ॥ (బ్ర.పు. 1.10)
8. స్వావాసహేతు ర్హరిణా వాహితం వాయునాచలాత్ ।
రాజన్! శేషనిమిత్తేన శేషాచల మిమం విదుః ॥ (భ.పు 1.127)



ఇంత దూరం రావడంచేత, ఈ పర్వతాన్ని శేషుడావరించడం చేత దీనికి శేష పర్వతమనే ప్రసిద్ధి కలిగింది.

**గరుడాచలం**

శ్వేతవరాహకల్పంలో వరాహస్వామి ఆజ్ఞచేత శ్రీవైకుంఠం నుంచి గరుత్మంతుడీ పర్వతాన్ని తీసుకురావడంవల్ల దీనికి గరుడాచలమనే పేరొచ్చిందని వరాహపురాణం వివరిస్తోంది.

**వేంకటాద్రి**

ఈ పర్వత ప్రభావాన్ని బట్టి దీన్ని అందరు వేంకటాద్రి అని అంటున్నారని తెలుస్తోంది.

వేంకట శబ్దానికి రెండు విధాల వ్యుత్పత్తులు ప్రచారంలో ఉన్నాయి.

ఇందులో ఒక వ్యుత్పత్తి వరాహపురాణంలో ఇలా ఉంది.

**వేంకారోఽమృతబీజస్తు కటమైశ్వర్య ముచ్యతే ।**
**అమృతైశ్వర్య సంఘత్వా ద్వేంకటాద్రి రితి స్మృతః[9] ॥(వ.పు.)**

'వేం' కారానికి అమృతమని అర్థం. 'కటం' అంటే ఐశ్వర్యమని అర్థం. ఈ పర్వతం ఆశ్రితులకు అమృతాన్ని ఐశ్వర్యాన్ని అనుగ్రహిస్తుంది. కాబట్టి దీనికి వేంకటాద్రి అని ప్రసిద్ధి కలిగిందని తెలుస్తోంది.

భవిష్యోత్తర పురాణంలో 'వేంకట' శబ్దాని కిలా వ్యుత్పత్తి ఉంది. "వేం కట తీతి వేంకటః". లోకంలోని పాపాలన్నీ 'వేం' అని చెప్పబడు తున్నాయి. వాటిని దహించగల పర్వతం వేంకటశైలం.

9. ప్రథమభాగ 37అ–31శ్లో.

**సర్వపాపాని వేం ప్రాహుః కటస్తద్దాహ ఉచ్యతే ।**
**తస్మా ద్వేంకటశైలోఽ యం లోకే విఖ్యాతకీర్తిమాన్[10] ॥**

## నారాయణాద్రి

త్రేతాయుగంలో ఇది నారాయణాద్రి అని పిలువబడిందని వరాహ పురాణం చెబుతుంది. బ్రహ్మాండ పురాణంలో నారాయణుడనే విప్రుని ప్రార్థన మన్నించిన శ్రీనివాసుడు ఈ పర్వతానికి నారాయణాద్రి అనే పేరు పెట్టినట్లు తెలుస్తోంది.[11]

## వృషభాద్రి

పూర్వం ఈ పర్వతంపైన వృషభుడనే రాక్షసుడు తపస్సు చేశాడు. తన పేరుతో ఈ పర్వతం పిలవబడాలని అతడు కోరిన కోర్కెను శ్రీనివాసు డనుగ్రహించాడు. అందువల్ల ఈ పర్వతాన్ని కృతయుగాంతం దాకా వృషభాద్రి అని పిలిచేవారు.[12]

## వృషాద్రి

'వృష' శబ్దానికి ధర్మమని అర్థం. ధర్మం తన అభివృద్ధి కోసం ఈ పర్వతం పైన తపస్సు చేయడంవల్ల దీనికి వృషాద్రి అనే పేరేర్పడింది.

ఈ అంశాన్ని వరాహపురాణం ఇలా వివరిస్తుంది.

10.భ.పు 1.220-221

11. అనన్త విహగేశాన సేనాపతి ముఖైస్సదా ।
సేవ్యమానః శ్రియా సార్థం విహరన్ వసమాధవ॥
గిరిశ్చాయం హిమన్నామ్నా ప్రసిద్ధి మధిగచ్ఛతు ।

12. (బ్రహ్మాండ.పు. 4-43) అద్యప్రభృతి చాయం వైగిరిరుచ్ఛిత శేఖరః ।మదాఖ్యయా ప్రథాం యాతు వృషభాచల ఇత్యపి ।) బ్రహ్మాండ4-43



**గిరావస్మింస్తపస్తేపే ధర్మోఽ పి స్వాభివృద్ధయే।**
**తస్మాదాహు ర్వృషాద్రిం తం మునయో వేదపారగాః ॥[13]**

## యుగప్రసిద్ధి

వరాహ-భవిష్యోత్తర పురాణాలలో ఈ పర్వతానికి ప్రతియుగంలోను ప్రత్యేకమైన ప్రసిద్ధి ఉన్నట్లు చెప్పబడింది. వరాహపురాణం ఈ ప్రసిద్ధిని ఇలా పేర్కొంది.

**కృతే వృషాద్రిం వక్ష్యంతి త్రేతాయా మంజనాచలమ్ ।**
**ద్వాపరే శేషశైలేతి కలౌ శ్రీవేంకటాచలమ్ ॥[14]**

## తిరుమల దివ్యతీర్థాలు

శ్రీ వేంకటాచల సానువులలో 1191 తీర్థాలున్నట్లు వరాహపురాణం పేర్కొంటుంది. బ్రహ్మపురాణాన్ననుసరించి వేంకటాద్రిలో 66 కోట్ల పుణ్య తీర్థాలున్నాయని తెలుస్తోంది. అందులో 1008 తీర్థాలు చాలాముఖ్య మైనవిగా గుర్తింపు పొందాయి. మొత్తం మీద ఈ పర్వతపంక్తిలో అనేక దివ్యతీర్థాలున్నట్లు, అవి ప్రభావం కలవిగా పురాణాల్లో వర్ణించారు.

## తీర్థశబ్దార్థం

తీర్థశబ్దానికి మొదట పుణ్యమని అర్థం. ఆ శబ్దం రాను రాను పవిత్రమైన జలం అనే అర్థంలో ప్రయోగించారు. పుణ్యమంటే శుభాన్ని చేసేది అనే అర్థంలో ప్రయోగాలున్నాయి. తీర్థమనగా తరింపజేసేది అని అర్థం. పుణ్యజలాన్ని తీర్థమనే శబ్దంలో చెప్పటం పరిపాటి అయింది. అందుకే పుణ్యక్షేత్రాన్ని తీర్థక్షేత్రమని దివ్యక్షేత్రమని పిలవటంకూడా ఉంది.

13. వ.పు. 36-23

14. భ.పు I.36,37

## ముఖ్యతీర్థాలు

తిరుమలలో మూడుకోట్ల తీర్థాలున్నాయని ప్రసిద్ధి ఉంది. వీటిలో కొన్ని సుప్రసిద్ధమైనవి కాగా, కొన్ని నామమాత్రంగా ప్రచారంలో ఉన్నాయని పురాణాలద్వారా తెలుస్తున్నది.

సర్వతీర్థాలలోను ముఖ్యమైన పుణ్యతీర్థాలు:

1. ధర్మరతిప్రదాలు, 2. జ్ఞానప్రదాలు, 3. భక్తి వైరాగ్యప్రదాలు, 4. ముక్తి ప్రదాలు.

### 1. ధర్మరతిప్రదాలు

ఆ యా తీర్థాల వాసం, స్నానం, పానంచేత మానవునికి ధర్మాసక్తిని కలుగజేసి ఉత్తమమార్గాన్ని ప్రసాదించే ఈ తీర్థాలు 1008.

### 2. జ్ఞానప్రద తీర్థాలు

ఇవి 108 తీర్థాలు. ఇవి మానవులకు సద్జ్ఞానాన్ని కలుగజేస్తాయి.

### 3. భక్తి వైరాగ్య ప్రద పుణ్యతీర్థాలు

అరువది ఎనిమిది తీర్థాలు. ఈ తీర్థాలు భక్తియోగం ద్వారా సంసారం నుండి విముక్తిని కలుగజేస్తాయని పురాణాలు తెలియజేస్తున్నాయి.

### 4 ముక్తి ప్రద పుణ్యతీర్థాలు

వేంకటాచలమాహాత్మ్యం అభివర్ణించిన పదకొండు పురాణాల్లో ఇరవై ఆరు ముఖ్యతీర్థాలు పేర్కొనడ మైనది. అవి-

1. కుమారధారా తీర్థం 2. కపిలతీర్థం 3. పాండవ తీర్థం 4. జరాహరతీర్థం 5.ఫల్గుణి తీర్థం 6. జాబాలి తీర్థం 7. సనకసనందన తీర్థం 8.కాయ రసాయనతీర్థం 9. పాపనాశనతీర్థం 10. దేవతీర్థం 11. పద్మసరోవర



తీర్థం 12. అస్థిసరోవర తీర్థం 13. తుంబురు తీర్థం 14. ఆకాశగంగ తీర్థం 15. చక్రతీర్థం 16. కటాహతీర్థం 17. మన్వాద్యష్టోత్తరశతతీర్థాలు 18. రామకృష్ణతీర్థం 19. శంఖతీర్థం 20. కల్యాతీర్థం 21. శక్రతీర్థం 22. విష్వక్సేనతీర్థం 23. పంచాయుధతీర్థం 24. బ్రహ్మతీర్థం 25. సప్తర్షితీర్థం 26. వ్రతతీవర్తనీతీర్థం.

వీటిని గురించి సంగ్రహంగా తెలుసుకుందాం.

### కుమారధారాతీర్థం

ఇది ఇప్పటికీ తిరుమలలో ప్రవహిస్తున్నది. తిరుమల-తిరుపతి దేవస్థానములు ఇక్కడొక చిన్నడ్యామ్‌ను నిర్మించింది. దీనిప్రాచీన చరిత్రను పరిశీలిస్తే ఎంతో ఆశ్చర్యకరమైన ఉదంతం ఒకటి తెలుస్తున్నది. ఈ తీర్థం వరాహ- పద్మ- వామన- మార్కండేయ పురాణాల్లో వర్ణించబడింది.

### వరాహపురాణం

వరాహపురాణం కుమారధారాతీర్థమాహాత్మ్యాన్ని ఇలా అభివర్ణిస్తున్నది.[15]

ఒకప్పుడు శ్రీనివాసుడు వేంకటాచలంపై సంచరిస్తుండగా ఒక వృద్ధ బ్రాహ్మణుడు-ఓ కౌండిన్యా! నన్ను వదలిపెట్టి ఎక్కడి కెళ్ళావు? నేను శతవృద్ధుణ్ణి. ఎలా ఒంటరిగా ప్రయాణం చేయను? అని విలపించాడు.

నవయౌవనుడిగా శ్రీనివాసుడు అతని దగ్గరకువెళ్ళి-ఇక్కడ కౌండిన్యుడు కాదు గదా। ఏ ఒక్క మానవుడు కూడా లేడు. నీకేం కావాలి ! అని అడిగాడు. దానికా ముసలివాడు- నాయనా ! నా ఆశ్రమం చాలా దూరంలో ఉంది. నా కుమారుడు కౌండిన్యుడు లేకపోతే నన్నెవ్వరు అక్కడికి

15. వ.పు 37.31-53

తీసుకువెళతారు! నా ధర్మాన్ని నే నాచరించలేను గదా ! ఇంకా ఎందుకు నన్ను భగవంతుడు బతికిస్తున్నాడు ? అని బాధపడ్డాడు.

శ్రీనివాసు డావృద్ధుడి మాటలు విని–నీకు కళ్ళు కనపడవు. చెవులు వినపడవు. ఇంకా ఎందుకు బ్రతకాలని నీకు కోరిక అని అడిగాడు. దానికా వృద్ధుడు–నాకు ఒకే ఒక ప్రయోజనం కోసమే బ్రతకాలని కోరిక. జ్యోతిష్టో మాది యజ్ఞాలను ఆచరించి దేవఋణాన్ని తీర్చుకోవాలి. అందుకే బతకా లనుకుంటున్నానన్నాడు.[16]

వేంకట విభుడా వృద్ధుని మాటలకు సంతోషించి కొంతదూరం చేయి పట్టుకొని ఆ పండుముసలిని తీసికెళ్ళి ఒక తీర్థంలో స్నానం చేయించాడు. స్నానం చేసి పైకి లేచేసరికి ఆశ్చర్యకరంగా, వృద్ధుడు కాస్తా పదహారేళ్ళ నవయౌవనుడైనాడు. ఈ తీర్థస్నానంవల్ల వృద్ధుడు కుమారుడు కావడం చేత దీనికి కుమారధారా తీర్థమని ప్రసిద్ధి ఏర్పడింది.

ఈ కథ వరాహపురాణంలో మనకు కనపడుతుంది. పద్మపురాణంలో ఈ తీర్థమాహాత్మ్యం ఇంకోవిధంగా ఉంది.

**పద్మపురాణం**

కుమారధార మహిమ ఇంత అని చెప్పడానికి వీలు లేదు. పూర్వం దేవతల ప్రార్థనలను మన్నించి కుమారస్వామి అసురులను సంహరించగా శంకరు డతనిని సైన్యాధ్యక్షుడుగా నియమించాడు. కుమారస్వామికి ఆ పదవిపై కోరికలేదు. అతను శ్రీమన్నారాయణుని ఆజ్ఞచే వేంకటాచలంపైన ఒక ప్రదేశంలో వివిధ పుష్పాలతో ఆ స్వామిని ఆరాధిస్తూ తపస్సు చేయ

16. కిన్తునిత్యాని కర్మాణి జ్యోతిష్టోమ ముఖానిథ చ ।
నాఽనుష్ఠితాని దేవానామృణీ కథమహంపునః ॥
త్యక్ష్యామి దేహం భో రాజన్ । సత్యమేవ బ్రవీమితే (వ.పు 37.41.42)



సాగాడు. అతని తపస్సుకు సంతోషించిన శ్రీనివాసుడు దర్శనమిచ్చి, శక్తి అనే ఆయుధాన్ని ఇచ్చి అంతర్ధానమైనాడు. కుమారస్వామి కైలాసానికి వెళ్ళాడు. కుమారస్వామి తపస్సు చేసి సిద్ధి పొందిన ప్రాంతంలో ఈ తీర్థం ప్రవహించడం వల్ల దీనికి 'కుమారధారా తీర్థం' అనే ప్రసిద్ధి ఏర్పడిందని పద్మపురాణం వర్ణిస్తున్నది.

**వామనపురాణం**

వరాహ–పద్మపురాణాలకు భిన్నంగా వామనపురాణం కుమారధారా తీర్థమాహాత్మ్యాన్ని వర్ణిస్తున్నది.[17]

ఒకప్పుడు కుమారస్వామి తపోభంగం కలగకుండా ఉండే ఒక విష్ణు క్షేత్రాన్ని చెప్పమని తన తండ్రి శంకరుణ్ణి అడుగుతాడు. దానికి త్రిలోచనుడు "వృషాద్రి పైన వృషభుడనేవాడు పూర్వం తపస్సు చేశాడు. నీవుకూడా అక్కడికే వెళ్ళి తపస్సు చెయ్యి" అన్నాడు. కుమారస్వామి తండ్రి మాటలకు– "ఈ పర్వతం కులపర్వతం కాదుకదా! ఎక్కడ ఉంది?" వివరంగా చెప్పమన్నాడు.

శివుడు ఇలా చెప్పడం మొదలుపెట్టాడు. "కుమారా! మేరుపర్వత పుత్రుడైన వృషాద్రి కులాచలమే. లోకాలన్నింటిలో దీనికి అంజనాద్రి అనే ప్రసిద్ధి ఉంది. స్వర్ణమయమైన ఈ పర్వతం రత్నాలకు పుట్టిల్లు. వాయు–శేషసంవాదంవల్ల ఇది దక్షిణ దిక్కుకు వచ్చింది. దీని శిఖరం చూచినా సర్వపాపాలు నశిస్తాయి. చరాచర సృష్టికి మూలభూతమైన

17. తత్ర రమ్యే శుచౌదేశే దదర్శ సర ఉత్తమమ్ ।
స్నానార్థం దేవపూజార్థం పద్మోత్పల సుశోభితమ్ ।
కృత స్నానః సరస్తీరే కుమారః సముపావిశత్ । (వామన.పు. 21.102–103)

వాయువు ఇక్కడ ఘోరమైన తపస్సును ఆచరించాడు. కనుక నీవు కూడా అక్కడికే వెళ్ళి తపస్సు చెయ్యి!"

తండ్రిద్వారా తారక మంత్రోపదేశం పొందిన కుమారస్వామి వేంకటాచలంపైన ఒక తటాకాన్ని తీసి కొంతకాలం తపస్సు చేశాడు. కుమారస్వామి తపస్సు చేసిన ప్రదేశంలో ఉన్న తీర్థం కాబట్టి దీనికి కుమారధార అనే పేరే ర్పడింది.

**మార్కండేయపురాణం**

వరాహ పురాణం పేర్కొన్న కథనే ఈ పురాణం కొద్ది మార్పుతో ఇలా పేర్కొంటున్నది.[18]

పూర్వం ఒకవృద్ధ బ్రాహ్మణుడు సంసారబాధలు భరించలేక దుఃఖంతో భార్యాబిడ్డల్ని వదిలి సువర్ణముఖరీ తీరంలో ఉన్న వేంకటాద్రినుండి దూకి చనిపోవాలని నిశ్చయించుకున్నాడు. కొండ చివర నిలబడి దేవతల్ని ప్రార్థిస్తున్నాడు. ఇంతలో దయామయుడైన వేంకటాచలపతి మృగయాసక్తిగల రాజకుమారుని రూపంలో కనబడి ఆ బ్రాహ్మణునితో ఇలా అన్నాడు.

"ఓ బ్రాహ్మణుడా! నీవు కొండదిగి ఇక్కడికిరా! ఎందుకింత సాహసం చేస్తున్నావు ? విప్రుడు ఆత్మహత్య చేసుకోకూడదు. నీకేం కావాలో అడుగు!" ఆ మాటలకు ఆశ్చర్యపడిన ఆ వృద్ధుడు "నా కేమీ వద్దు. నా భార్యాబిడ్డలను పోషించుకోవడానికి కావలసిన డబ్బు ఇస్తానంటే దిగివస్తా" అన్నాడు.

18. అస్య తీర్థస్య మహిమాహ్యహో। వాచామగోచరః
కుమారత్వం ధనిత్వంచ సద్య ఏవ ద్విజోఽభవత్॥
యతః కుమారతాం యాతః సద్యోవృద్ధ మహీసురః।
తస్మాత్ కుమారధారేతి లోకే ఖ్యాతిః గమిష్యతి
కుమారతీర్థేఽయః స్నాతో నిష్పాపః ససుఖీభవేత్ ॥ (మార్క.పు.తీ 3.38-40)



వేంకటేశ్వరు డలాగేనని చెప్పి చెయ్యిపట్టుకొని రమ్మని పాపనాశన తీర్థానికి ఉత్తరంగా ఉన్నతీర్థంలో స్నానం చేయించగా ఆ వృద్ధుడు యువకుడైనాడు మనస్సు నిర్మలమైంది.

ఇంతలో ఆకాశవాణి- "నీకు వేంకటేశ్వరుడు సకల సంపదల్ని ఇచ్చాడు. భార్యాబిడ్డలతో కలసి దానధర్మాలుచేస్తూ సుఖంగా జీవితాన్ని గడుపు" అన్నది. స్నానమహిమచే వృద్ధుడు కుమారుడు కావడంవల్ల ఆ తీర్థానికి అప్పటినుండి కుమారధార అనే పేరేర్పడింది.

మార్కండేయ పురాణంలోనే ఈ తీర్థంలో స్నానం చేయడంవల్ల కుమార స్వామికి బ్రహ్మహత్యా దోషం పోయినట్లు కూడా చెప్పబడింది.[19]

కుమారస్వామి తారకాసుర సంహారంచేసి, దానికి వాయవ్యదిక్కున ఒక సరస్సు తీరంలో తారకమంత్రాన్ని జపిస్తూ పన్నెండేళ్ళు తపస్సు చేశాడు. అప్పుడు శ్రీనివాసుడు ప్రత్యక్షమై కుమారా! నీవు బ్రహ్మహత్యా దోషంనుంచి విముక్తుడవైనావు ఇప్పటి నుంచి ఈ సరస్సు కుమారధారా తీర్థమనే పేరుతో ప్రసిద్ధమవుతుందని వరాన్ని ప్రసాదించాడు.

మార్కండేయుడు ఈ చరిత్ర విని కుమారధారికలో స్నానం చేసి శ్రీనివాసుని సాక్షాత్కారాన్ని సకల తీర్థ యాత్రా ఫలాన్ని పొందాడు.

## కపిలతీర్థం

కపిలతీర్థాన్ని గురించి వరాహపురాణం ఇలా చెబుతున్నది పూర్వం వేంకటాచలానికి అడుగున పాతాళలోకంలో కపిలమహర్షి కపిల లింగాన్ని పూజిస్తూ ఉండేవాడు. ఏదో కారణంవల్ల పరమపావనమైన ఆ లింగం పాతాళాన్ని ఛేదించుకొని భూమిపైకి రాగా దేవతలుకూడా దాన్ని

19. శృణ్వన్తు దేవతాః సర్వాః శృణు స్కన్ద వచోమమ। కుమార ధారికే త్వేవత్వన్నా మ్నేదం భవిష్యతి ॥ తత్ర స్నాతి పుమాన్ స్త్రీవాఽవశ్యం కోఽపి మానవః । తస్య పాపాని నశ్యన్తి సత్యం సత్యంవదామ్యహమ్। (మార్కండే.పు. తీ 4.59-60)

ఆరాధించారు. దేవతలు దాన్ని భూమిపైన ప్రతిష్ఠించారు. దానికి ముందు బిలంనుంచి ఒక తీర్థం ఏర్పడింది. అదే పవిత్రమైన కపిలతీర్థం.[20]

## పాండవతీర్థం

తిరుమలలో సుప్రసిద్ధమైన తీర్థాలలో పాండవతీర్థం ఒకటి. దీన్ని గురించి వరాహ - పద్మపురాణాలు ఇలా పేర్కొంటున్నాయి.

**వరాహపురాణం**

వరాహపురాణంలో ప్రథమభాగంలో నలభయ్యో అధ్యాయంలో పాండవతీర్థం మాహాత్మ్యం ఇలా అభివర్ణించబడింది.

శ్రీకృష్ణుని ఉపదేశాన్ననుసరించి పాండవు లైదుగురు వేంకటాచలానికి వచ్చి ఒక తీర్థంలో స్నానం చేస్తూ సంవత్సరకాలం తపస్సుచేశారు. ఒక రాత్రి ధర్మరాజు కొక స్వప్నం వచ్చింది. అందులో అశరీరవాణి ఇలా అన్నది. ఓ ధర్మరాజా! మీ పాపాలు నశించినాయి. మీకు యుద్ధంలో విజయం లభిస్తుంది. మళ్ళా మీరు పోగొట్టుకొన్న రాజ్యాన్ని పొందుతారు.

పాండవులు అక్కడ స్నానం చేసి తపస్సు చేయడంవల్ల ఇది పాండవ తీర్థమనే ప్రశస్తిని పొందింది.

వరాహపురాణం ద్వితీయ భాగంలో పాండవ తీర్థస్నానకాలం, ఆ కాలంలో సాన్నం చేసినవాళ్ళు పొందే ఫలం ఇలా చెప్పబడింది.[21]

సూర్యుడు వృషభరాశిలో ఉన్నప్పుడు శుక్లపక్షంలోగాని, కృష్ణపక్షంలో గాని ద్వాదశితిథిలో, ఆది-మంగళవారాల్లో పాండవతీర్థంలో స్నానం చేసిన వాళ్ళు సుఖంగా భూలోకంలో జీవితాన్ని గడిపి, పరలోకంలో సకల సుఖాలను అనుభవిస్తారు.

20. వ.పు.I 40.1-22
21. వ.పు.II 1.67-68



**పద్మపురాణం**

పాండవతీర్థాన్ని గురించిన ప్రస్తావన పద్మపురాణంలో కూడా కనబడుతున్నది.[22]

కురుక్షేత్రయుద్ధానంతరం పాండవులు జ్ఞాతులైన కౌరవులను చంపడంవల్ల వచ్చిన పాపాన్ని పోగొట్టుకోవడం ఎలాగని శ్రీకృష్ణుణ్ణి ఉపాయం అడుగుతారు. అప్పుడు శ్రీకృష్ణుడు వేంకటాచలంపై గల ఈ తీర్థంలో స్నానం చేయండని చెబుతాడు. అలాగే వాళ్ళు వేంకటాద్రికి వచ్చి ఈ తీర్థంలో స్నానం చేసి స్వామిపుష్కరిణీ తీరంలో స్వామిని ప్రార్థిస్తారు. తరువాత పాపం నశించి వారికి జ్ఞానోదయమౌతుంది. అటువంటి పాండవులు స్నానం చేయడంవల్ల దీనికి పాండవతీర్థమనే పేరువచ్చిందని ఈ పురాణం వివరిస్తున్నది.

## జరాహరతీర్థం

వరాహపురాణం మాత్రమే జరాహర, వలిఘ్న, రసాయనతీర్థాలను పేర్కొంటున్నది. ఈ మూడు తీర్థాలు చింతామణి పర్వతంపైన ఉన్నాయి. స్వామి పుష్కరిణికి తూర్పువైపున ఉన్న గుహలనుండి ఇరవై రెండు బాణాలుపట్టే చోటులో ఈ మూడు తీర్థాలున్నట్లు ఈ పురాణం తెలియజేస్తున్నది. కాని కాలక్రమేణా ఇవి అంతర్థాన మైనాయి. ఇప్పుడెవ్వరికీ ఇవి కన్పించడంలేదు. ఇవి చాలా ఆశ్చర్యకరమైన తీర్థాలని ప్రసిద్ధి.[23]

22. పా. పు. క్షే. 31.45-50
23. జరాహరం వలిఘ్నం చ రసాయనమితి త్రికమ్ ।
తీర్థానాం వర్తతే తస్మిన్ చిన్తామణి గిరౌతథా ॥
స్వామి పుష్కరిణీ పూర్వదేశే పర్వత గహ్వరే ।
ద్వావింశచ్ఛరపాతే తు కిన్తు మాయాతిరోహతమ్ ॥
నజానన్తి బుధాస్తీర్థం తత్తు విస్మయకారకమ్। (వ.పు. 40.27.29)

## ఫల్గుణీతీర్థం

ఫల్గుణీతీర్థ ప్రశంస వరాహపురాణంలో యాభై మూడో అధ్యాయంలో కనబడుతున్నది. ఈ తీర్థమాహాత్మ్యాన్ని వరాహపురాణమిలా పేర్కొంటున్నది.

ఒకప్పుడు శ్రీదేవి అరుంధతికి అనేక వరాలనిచ్చి, ఆమెకోరిక ననుసరించి అక్కడ ఉన్న సరోవరాన్ని ఫల్గుణీ తీర్థమని పిలిచింది. అప్పటినుంచి దీనికి ఫల్గుణీ తీర్థమని ప్రశస్తి వచ్చింది. ప్రతి ఫాల్గుణ మాసంలో పూర్ణిమనాడు ఫల్గుణీ నక్షత్రంలో ఈ సరోవరంలో స్నానం చేసినవాళ్ళకు లక్ష్మీదేవి అనుగ్రహం కలిగి సకలాభీష్టాలు సిద్ధిస్తాయని ఈ పురాణం తెలియజేస్తుంది.[24]

## జాబాలి తీర్థం

వరాహ–స్కాంద పురాణాల్లో జాబాలి తీర్థం వర్ణించబడింది.

**వరాహపురాణం**

ఫల్గుణీతీర్థానికి ఉత్తరాన స్వామిపుష్కరిణికి పశ్చిమాన జాబాలి తన శిష్యులతో ఒక ఆశ్రమంలో నివసిస్తుండేవాడు. అందువల్లనే అక్కడ గల తీర్థానికి జాబాలి తీర్థమనే పేరేర్పడింది.

**స్కాందపురాణం**

స్కాందపురాణం జాబాలి తీర్థమాహాత్మ్యాన్ని ఇలా వివరిస్తున్నది. పూర్వం కావేరీనదీ తీరంలో దురాచారుడనే బ్రాహ్మణుడుండేవాడు. అతను బ్రాహ్మణ

24. ఫాల్గుణ్యాం పూర్ణిమాయాం తు తత్తీరే కమలాలయా
అరున్ధతీతపః ప్రీతా ప్రాదు రాసీత్పురా కిల।
తస్యై దత్త్వా వరం చేష్టం ప్రార్థితా చ తయారమా।
దదౌ చ సరితో నామ ఫల్గుణీ శబ్ద పూర్వకమ్
ప్రీతో గృహే నివత్స్యామి సర్వకామ ఫలప్రదా। (వ.పు.I.53.13–16)



హంతకులతోను, కల్లుతాగిన వారితోను, దొంగలతోను, గురుపత్నిని పొందినవారితోను సహవాసం చేసి అతిదుష్టుడైనాడు. ఇంతటి పాపాత్ముడైన ఆ దురాచారుణ్ణి ఒక భేతాళుడు పట్టి పీడించ సాగాడు.

భేతాళ పీడితుడైన ఆ దురాచారుడు ఒక దేశాన్నుంచి ఇంకో దేశానికి ఒక వనం నుంచి ఇంకో వనానికి తిరుగుతూ పూర్వజన్మ సుకృత విశేషంచేత, దైవవశాన పవిత్రం, పాపహరమైన వేంకటాచలక్షేత్రానికి వెళ్ళాడు. మహా పాతకాలను నశింపజేసే జాబాలి తీర్థంలో స్నానం చేసిన వెంటనే భేతాళుడతణ్ణి వదలి వెళ్ళి పోయాడు.

స్నానంచేసి బయటకు వచ్చి అక్కడున్న యోగిపుంగవుడైన జాబాలికి నమస్కరించి అక్కడి పర్వతాన్ని గురించి ప్రశ్నించాడు. ఆ జాబాలి మహర్షి "నీ మహాపాతకాలను నశింపజేసింది ఈ వేంకట పర్వతమే" అని వివరించాడు.[25]

వేంకటాద్రిపైగల తీర్థాలలో ఈ జాబాలితీర్థం చాలా పవిత్రమైందిగా భావించబడుతున్నది.

## సనకసనందన తీర్థం

వరాహపురాణం మాత్రమే సనకసనందన తీర్థాన్ని గురించి ప్రస్తావించింది.

పాపనాశన తీర్థానికి ఉత్తరాన మూడుమైళ్ళ దూరంలో సిద్ధులు సేవించిన పుణ్యసరస్సొక్కటి ఉంది. దాన్నే సనకసనందన తీర్థమంటారు. ఎంతో నిగూఢంగా ఉన్న ఈ తీర్థాన్ని భూలోకంలోని మనుష్యులెవ్వరూ తెలుసుకోలేదు.

25. అత్ర మజ్జిన మాత్రేణ విముక్తః పాతకాద్భవాన్।
జాబాలి తీర్థే యే స్నానం పుణ్యం కుర్వన్తి మానవాః॥
తేషాం నశ్యన్తి వై సత్యం పంచపాతక సంచయాః॥ (స్కాం.పు.15.26–27)

మార్గశిరమాసంలో శుద్ధ ద్వాదశినాడు అరుణోదయకాలంలో మనోనిగ్రహంతో స్వామిపుష్కరిణిలో సాన్నంచేసి, త్రయోదశిరోజున సనకసనందన తీర్థంలో స్నానం చేస్తే అన్ని యోగాలు సిద్ధిస్తాయి.

## కాయరసాయన తీర్థం

కాయరసాయన తీర్థం వరాహపురాణంలో ఇలా వర్ణించబడింది.

సనకసనందన తీర్థానికి సమీపంలోనే రహస్యంగా కాయరసాయనతీర్థం కూడా ఉంది. అందులోని నీళ్ళను తాగడంవల్ల శరీరం వెంటనే పవిత్రమౌతుంది. ఏదైనా పాలిపోయిన ఆకును పరీక్షకోసం ఆ తీర్థంలో వేస్తే అది ఆ క్షణంలోనే పచ్చగా అవుతుంది.

ఈ తీర్థాన్ని సనక సనందనాది యోగులు రాతితో కప్పివేశారని, అది పుణ్యాత్ములకు మాత్రమే దర్శనమిస్తుందని ఈ పురాణం విశదపరుస్తున్నది.[26]

## పాపనాశనతీర్థం

పాపనాశన తీర్థ మాహాత్మ్యం వరాహ-స్కాంద పురాణాల్లో పేర్కొనబడింది.

### వరాహపురాణం

ఏ మాసంలో అయినా శుక్ల, కృష్ణపక్షాల్లో ఎప్పుడైనా ఆదివారం సప్తమి హస్తా నక్షత్రం కలసివచ్చిన రోజున పాపనాశన తీర్థంలో స్నానం చేస్తే, కోటిజన్మలలో చేసిన పాపాలన్నీ నశించిపోతాయని వరాహపురాణం తెలియజేస్తున్నది.[27]

26. శిలయా పిహితం తత్తు యోగిభిః సనకాదిభిః ।
మహాత్మానాం పుణ్యవతాం దర్శనం హి దదాతి తత్ ॥ (వ.పు.I.60-38)

27. శుక్లే పక్షేఽథ వా కృష్ణే యాఽర్క వారేణసప్తమీ
యుక్తా పుణ్యర్క్ష సంయుక్తా హస్తర్క్షేణ యుతాఽపివా॥ వ.పు.II 1-69



**తస్యా తిథౌ మహాభాగే పాపనాశన సంజ్ఞకే**
**తీర్థేయః స్నాతి నియమాత్ భూధరేన్ద్రస్యమస్తకే॥**
**కోటి జన్మార్జితైః పాపైః ముచ్యతే స నరోత్తమః ॥**

**(వ.పు.II.1.19-71).**

### స్కాందపురాణం

స్కాందపురాణం పాపనాశన తీర్థమాహాత్మ్యాన్ని ఇలా వివరిస్తున్నది.[28]

స్వామిపుష్కరిణికి ఉత్తరభాగంలో ఉన్న ఈ తీర్థంలో సాన్నంచేసిన మానవులు శ్రీ వైకుంఠాన్ని పొందుతారు.

హిమవత్పర్వతానికి పక్కన బ్రహ్మాశ్రమం ఉంది. అందులో వేద వేద్యులైన వానప్రస్థులు, సన్యాసులు తమ తమ ధర్మాలను ఆచరిస్తూ ఉన్నారు. ఒకప్పుడు దృఢమతి అనే అన్యకులస్థుడు ఆ ఆశ్రమానికి వచ్చి శ్రేష్ఠుడైన ఒక మునికి నమస్కరించి తనకు తపస్సు చేసుకోవాలనే కోరిక కలిగిందని చెప్పాడు. దానికి ముని- నీవు అన్యుడవు కనుక ఉపదేశార్హుడవు కావని, ఉపదేశించిన వాడికి బ్రాహ్మణత్వం నశించి చండాలత్వం వస్తుందని చెప్పాడు.

తపస్సు చేయాలని దృఢనిశ్చయంతో ఉన్న ఆ దృఢమతి జ్ఞానసంపాదన కోసం కందమూలాలను భుజిస్తూ, తపస్సు చేస్తూ కొంతకాలం గడిపాడు. ఇలా ఉండగా భార్గవాంశ సంజాతుడు ఇంద్రియ నిగ్రహం కలవాడైన సుమతి అనే ముని దృఢమతి ఆశ్రమానికి వచ్చాడు.

దృఢమతి సుమతిని పూజించి యాగాధికారాన్ని గురించి తెలుపమని ప్రార్థించగా అతడలాగే తెలియజేసి వెళ్ళిపోయాడు. తరువాత ఆ సుమతి దృఢమతి పోషణలో చనిపోయాడు. యమకింకరు లతణ్ణి నరకంలో పడవేశారు. ఇలా కొన్ని కోట్ల సంవత్సరాలు నరకా న్ననుభవించి తరువాత

28. స్కాం.పు.I.9.16-91.

వృక్ష, పాషాణ రూపాలను ధరించి గాడిద, పంది, కుక్క కాకిజన్మల నెత్తి క్రమంగా మళ్ళా బ్రాహ్మణ జన్మనెత్తాడు.

ఇలా జన్మించిన సుమతి అడవిలో సంచరిస్తుండగా అతడిని ఒక బ్రహ్మరాక్షసి పట్టుకొన్నది. దానివల్ల అతను ఏడుస్తూ, నవ్వుతూ, తిరుగుతూ ఉన్నాడు. తనకుమారుడిలా పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడం చూసి అతని తండ్రి సువర్ణముఖరీ తీరంలో ఉన్న అగస్త్యుని దగ్గరకు వెళ్ళి తన కుమారుణ్ణి బ్రహ్మరాక్షసి వదలివెళ్ళే మార్గం చెప్పమని ప్రార్థించాడు. దానికి అగస్త్యుడిలా అన్నాడు–"నీ కొడుకు పూర్మజన్మలో చేసిన పాపాన్ని అనుభవిస్తున్నాడు. వేంకటాచలంపైన ఉన్న పాపనాశన తీర్థంలో స్నానం చేయిస్తే బ్రహ్మరాక్షసి నాశనమై పోతుంది".

అగస్త్యమహర్షి ఆదేశాన్ననుసరించి ఆ బ్రాహ్మణుడు పాపనాశన తీర్థంలో మూడురోజులు తన కుమారుణ్ణి సాన్నం చేయించగా అతడికి పట్టిన బ్రహ్మరాక్షసి వదలిపోయింది.

వైదిక కర్మలను చేయదంవల్ల దృఢమతి నీచజన్మలనెత్తి చివరకు గ్రద్దగా జన్మించాడు. పాపనాశన తీర్థంలో నీళ్ళు తాగడానికి వచ్చి ఆ నీళ్ళతో శరీరాన్ని తడుపుకొని, దివ్య దేహాన్ని పొంది స్వర్గానికి వెళ్ళాడు. పాపాలను నశింపజేసేది కాబట్టి దీనికి "పాపనాశన" అనేపేరు సార్థకమైంది.[29]

### భద్రమతి వృత్తాంతం

పాపవినాశన మాహాత్మ్యాన్ని స్కాందపురాణం ఇంకో కథ ద్వారా ఇలా నిరూపిస్తున్నది.

పూర్వం భద్రమతి అనే బ్రాహ్మణుడుండే వాడు. అతను గర్భదరిద్రుడు. అతనికి నల్గురు భార్యలు. రెండు వందలమంది పిల్లలు. దారిద్ర్య బాధ

29. ఏవం ప్రభావమేతద్వై తీర్థం పాపవినాశనమ్।
పాపానాం నాశనా ద్విప్రాః పాపనాశాభి ధం హితత్ ॥ (స్కాం.పు.I.9.90)



భరించలేక వాళ్ళందరిని పోషించలేక కుంగిపోతున్న భద్రమతితో అతని భార్య కామిని ఒకరోజు ఇలా అన్నది.

"వేంకటాచలంపైన సర్వపాపవినాశిని అయిన తీర్థరాజం ఒకటి ఉందని, దాని ప్రభావం వర్ణనాతీతమని చెబుతున్నారు. మీరొక్కసారి వెళ్ళి అందులో స్నానంచేసి రాకూడదా? మన దారిద్ర్యం అంతటితో పోవచ్చు గదా!"

భద్రమతి భార్యమాటను కాదనలేక వేంకటాచలానికి వెళ్ళడానికి నిశ్చయించుకొని సుశాలినీ నగరానికి వెళ్ళి సుఘోషుడనే బ్రాహ్మణుని దగ్గర అయిదుమూరల భూమిని యాచించాడు. సుఘోషుడు భద్రమతికి అయిదు మూరల భూమిని దానం చేశాడు. తరువాత భద్రమతి భార్యాపుత్రులతో వేంకటాచలానికి వెళ్ళి స్వామిపుష్కరిణిలో స్నానంచేసి భూదేవిని, శ్వేతవరాహమూర్తిని దర్శించి, శ్రీనివాసుని సేవించి, పాపనాశన తీర్థానికి వెళ్ళి సాన్నం చేసి, సదాచార సంపన్నుడైన భక్తునికి భూదానం చేశాడు.

శ్రీనివాసుడు భద్రమతికి ప్రత్యక్షమై– "నీ పాపాలన్నీ నశించి పోయినాయి. నీవు సకల భోగాలను అనుభవించి చివరన ముక్తి పొందుతావు". అన్నాడు. పాపాలన్నీ పోగొట్ట జాలింది కాబట్టి "పాపనాశని" అనే పేరు ఈ తీర్థానికి సార్థకమైందని స్కాందపురాణం చెబుతున్నది.[30]

## దేవతీర్థం

ఒక్క వరాహపురాణంలోనే దేవతీర్థానికి సంబంధించిన ప్రస్తావన కనబడుతోంది.

తిరుమలలో ఆనందనిలయ విమానానికి వాయవ్య దిక్కున ఉన్న ఒక కొండగుహలో దేవతీర్థం విలసిల్లుతూ ఉంది. వరాహమూర్తి భూదేవితో ఈ

30. స్కాం.పు.I.10

తీర్థంలో స్నానం చేయాల్సిన కాలాన్ని గురించి ఇలా తెలియజేశాడు. "పుష్యమీ నక్షత్రంతో కలిసిన గురువారంనాడు గానీ, వ్యతీ పాతకాలంలో గానీ, శ్రవణా నక్షత్రంతో కలిసిన సోమవారంనాడుగానీ, ఈ దేవతీర్థంలో సాన్నం చేస్తే ఈ లోకంలో తెలిసి చేసిన పాపాలన్నీ నశించిపోయి, పుణ్యాలు వృద్ధి పొందుతాయి. వాళ్ళు ఈ లోకంలో పుత్రపౌత్రులతో సుఖసంతోషాలననుభవించి చివరకు స్వర్గాన్ని పొంది చంద్రలోకంలో పూజలు పొందుతారు. ఈ తీర్థం దగ్గర అన్నదానం చేసినవాడు జీవితాంతం పుష్కలంగా అన్నదానం చేయడానికి సమర్థుడౌతాడు.[31]

## పద్మసరోవరం తీర్థం

పద్మపురాణం పద్మసరోవరతీర్థాన్ని గురించి ఇలా పేర్కొంటున్నది. పూర్వం లక్ష్మీదేవి భృగుమహర్షి చేత అవమానం పొంది పాతాళలోకానికి వెళ్ళి కపిలమహర్షి చేత భక్తి ప్రపత్తులతో పూజింపబడి కొంతకాలం అక్కడే ఉన్నది.

శ్రీమహావిష్ణువు భృగుమహర్షిని పూజించి, నీళాదేవిని అక్కడే నిలిపి, భూదేవితో భూమండలంలోనికి వచ్చాడు. లక్ష్మీదేవిని వెదుక్కుంటూ ఆయన కొల్హాపురం వెళ్ళాడు. అక్కడ యోగ్యమైన స్థలంలో లక్ష్మీదేవిని అర్చామూర్తిగా

31. దేవతీర్థ మితిఖ్యాతం తటాకమతి శోభనమ్ ।
తస్మిన్ పుణ్యమే దేవి స్నానకాలం వదామితే ।
గురుపుష్యే వ్యతీపాతే సోమశ్రవణకే తథా ।
దినేష్వే తేషుయః స్నాతి తస్యపుణ్యఫలంశృణు ।
యాని కానీహ పాపాని జ్ఞానాజ్ఞాన కృతానిచ ॥
తాని సర్వాణి నశ్యన్తి దేవ తీర్థేఽతి పావనే
పుణ్యాన్యపి చ వర్ధన్తే దేవ తీర్థనిమజ్జనాత్ ॥
దీర్ఘ మాయురవాప్నోతి పుత్రపౌత్ర సమన్వితః ।
ఆన్తే స్వర్గం సమాసాద్య చంద్రలోకేమహీయతే వ.పుII-1.72-76



ఆలయంలో ప్రతిష్ఠించి ఆరాధిస్తూ ఉన్నాడు. ఇలా పది సంవత్సరాలు గడిచి పోయాయి. ఇంతలో ఒకరోజు ఆకాశవాణి విష్ణువుతో ఇలా అన్నది.

ఇక్కడికి దక్షిణాన కృష్ణానదికి దక్షిణదిక్కున ఇరవైరెండు యోజనాల దూరంలో సువర్ణముఖరీనదికి ఉత్తరతీరంలో ఎందరో మునులు తపస్సు చేసుకుంటూ ఉంటారు. నీవక్కడ ఒకసరస్సును కల్పించి అందులో దేవ లోకాన్నించి బంగారు కమలాలను తీసికొని వచ్చి వేయము. అనేక పుష్పలతలను వృక్షాలను దానిచుట్టూ నాటి చక్కని వనాన్ని తయారుచేసి అందులో ఉండి లక్ష్మీ ఏకాక్షరినిగాని, సప్తాక్షరినిగాని పఠిస్తూ పన్నెండు సంవత్సరాలు సేవించు ఆ సరస్సులో బంగారు పద్మంలో పదహారేళ్ళ కన్యగా లక్ష్మీదేవి ఆవిర్భవిస్తుంది."

ఆకాశవాణి మాటలు విని విష్ణువు అలాగే సువర్ణముఖీ నదీతీరంలో ఆవు చెవి ఆకారంలో ఒక అందమైన సరస్సును నిర్మించి, వాయువు ద్వారా బంగారు పద్మాలను తెప్పించి అందులో వేశాడు. ఆ నదికి ఉత్తరాన సూర్యభగవానుని ప్రతిష్ఠించి అక్కడ పన్నెండు సంవత్సరాలు తపస్సు చేయడానికి దీక్షవహించాడు. అదిచూసి ఇంద్రుడు మానవుడెవరో తపస్సు చేస్తున్నాడని రంభాద్యప్సరలసలను పంపాడు. కాని విష్ణుమాయకు వాళ్ళు తట్టుకోలేక వెళ్ళిపోయారు. ఇలా పన్నెండు సంవత్సరాలు గడువగా పదమూడో సంవత్సరంలో కార్తీకశుద్ధ పంచమీ శుక్రవారం, మంత్రమనే సుమూర్తంలో ఉత్తరాషాఢా నక్షత్రంలో ఆ పద్మసరస్సు మధ్యభాగంలో గొప్ప వెలుగొకటి ఆవిర్భవించింది. వెంటనే సరో మధ్యంలో ఉన్న స్వర్ణకమలంలో తేజోరాశి అయిన లక్ష్మీదేవి కల్హారమాలను ధరించి అవతరించింది. బ్రహ్మాది దేవతలు వచ్చి లక్ష్మీ దర్శనం చేసుకున్నారు. లక్ష్మీదేవి కల్హారమాలను విష్ణువు కంఠంలో సమర్పించింది.

శ్రీహరి ఎంతో సంతోషించి పద్మ సరస్సుకు ఇలా వరమిచ్చాడు. "ఓ పద్మసరస్సా ! పద్మకాంతితో భాసించే నీ తీరంలో తపస్సుచేసి నేను శాశ్వతంగా లక్ష్మిని పొందగలిగాను కనుక నీ విప్పటి నుంచి 'పద్మవాపిగా' ప్రసిద్ధి పొందుతావు.'పాద్మ' మని 'పద్మసరస్సు'ని నీకు పేర్లేర్పడతాయి. నీవు భూలోకంలో లక్ష్మికెంతో ప్రియమైన దానివి. నీకు మూడు లోకాల్లోను ప్రసిద్ధి ఏర్పడుతుంది." తరువాత విష్ణువు శేషాద్రికి వెళ్ళిపోయాడు.

ఈ పద్మసరస్సులో స్నానం చేయడంవల్ల సమస్తపాపాలు నశించి సకల సంపదలు సిద్ధిస్తాయని నారద, వసిష్ఠ, మరీచి, అత్రి, అంగిరస, పులస్త్య, పులహ, క్రమ, దేవదర్శనాది మహర్షులు వివరించారు.[32]

## అస్థిసరోవర తీర్థం

అస్థిసరోవరతీర్థం వరాహ-భవిష్యోత్తర-బ్రహ్మాండ పురాణాల్లోని వేంకటాచలమాహాత్మ్యంలో అభివర్ణితం.

### వరాహపురాణం

వరాహపురాణం అస్థిసరోవర మాహాత్మ్యాన్ని అభివర్ణిస్తూ వీరశర్మ వృత్తాంతాన్ని ఇలా పేర్కొంటున్నది.

ధర్మాచార తత్పరుడైన వీరశర్మ అనే విప్రుడు గంగాస్నానానికి భార్యాబిడ్డలతో బయలుదేరాడు. మార్గమధ్యంలో అతని భార్య గర్భవతి కాగా ఆమెను బిడ్డను ఆ ప్రాంతపురాజు సంరక్షణలో ఉండాలని ఆయనను దర్శించి ఇలా అన్నాడు.

"మహారాజా ! మాది వసిష్ఠగోత్రం. నా పేరు వీరశర్మ. నేను సకుటుంబంగా గంగాస్నానానికి వెళుతున్నాను. కాని నా భార్య లక్ష్మి

32. పా.పు.క్షేత్ర.34.84-93.



గర్భవతి. కనుక నేను గంగాస్నానం చేసి తిరిగి వచ్చేవరకు ఈమెను మీ అంతఃపురంలో ఉంచి సంరక్షించమని ప్రార్థిస్తున్నాను".

వీరశర్మ కోరికను రాజు మన్నించగా అతను గంగాస్నానానికి వెళ్ళి పోయాడు. రాజు అంతఃపురంలో ఒక ఇంట్లో ఉంచి ఆమెకు ఆరుమాసాల వరకు కావలసిన సామగ్రిని పంపాడు.

ఆ విప్రుడు ప్రయాగ క్షేత్రాన్ని దర్శించి, వారణాసిలో గంగస్నానం చేసి, మూడు రోజులక్కడ నివసించి, పితృశ్రాద్ధంచేసి, అయోధ్య, బదరి, సాలగ్రామ క్షేత్రాలను దర్శించి, రెండు సంవత్సరాల తరువాత చైత్రశుద్ధ ఏకాదశిరోజున రాజు దగ్గరకు వచ్చాడు.

విప్రుడు వచ్చేదాకా రాజు అతని విషయాన్నే మర్చిపోయాడు. అంతఃపురగృహంలో ఉన్న విప్రుని భార్య చనిపోయి ఎముకలు మాత్రమే మిగిలి ఉన్నాయి. వీరశర్మ గంగాజలాన్ని రాజుకిచ్చి తనభార్య కుశలవార్తల నడిగాడు. విప్రభార్యవృత్తాంతాన్ని తెలుసుకొన్న రాజు భయపడి సొరంగ మార్గంగుండా వేంకటాచలానికి వెళ్ళి శ్రీ నృసింహస్వామిని దర్శించి, శ్రీనివాసుని సేవించి బ్రాహ్మణి వృత్తాంతాన్ని విన్నవించాడు.

శ్రీ వేంకటేశ్వరుడు రాజుతో "నీవు భయపడవద్దు, ద్వాదశినాడు ఆమె అస్థులను పల్లకి ఎక్కించి, నీ భార్యతో కలసి నీవు ఆలయానికి తూర్పు దిక్కున ఉన్న అస్థిసరోవరంలో స్నానం చేయించు" అన్నాడు.

రాజు శ్రీనివాసుడు చెప్పినట్లు చేశాడు. ఆశ్చర్యంగా అస్థులరూపంలో ఉన్న లక్ష్మి మామూలు శరీరాన్ని ధరించివచ్చి వీరశర్మతో బాటు స్వగ్రామానికి చేరింది.

అస్థికలు ముంచగానే ప్రాణాలు తిరిగి రావడంచేత ఈ తీర్థానికి అప్పటి నుంచి అస్థితీర్థమనే పేరు వచ్చింది.[33]

33. వ.పు.II.10.69-78.

## భవిష్యోత్తరపురాణం

భవిష్యోత్తర పురాణం అస్థితీర్థ మాహాత్మ్యాన్ని వివరించడానికి కూర్మద్విజ వృత్తాంతాన్ని నిరూపిస్తున్నది.

పూర్వం వసిష్ఠగోత్రంలో జన్మించిన కూర్ముడనే బ్రాహ్మణుడు చనిపోయిన తన తండ్రి అస్థులను తీసుకొని వెళ్ళి గంగాస్నానం చేసి ఆ నదిలో నిమజ్జనం చేయాలనుకున్నాడు.

తొండమాన్ చక్రవర్తి రాజ్యానికి వచ్చి ఆ రాజును సందర్శించి ఇలా చెప్పాడు. "రాజా! నా తండ్రి అస్థికలను గంగలో నిమజ్జనం చేయడానికి వారణాసి వెడుతున్నాను. నా భార్య గర్భవతి. ఈ అయిదు సం॥ వయస్సుగల నా కొడుకు, ఈమె నా వెంట రాలేరు. కనుక నా భార్యాబిడ్డలకు తిరిగి వచ్చేవరకు నీవే ఆశ్రయం కల్పించాలి"

దానికి తొండమానుడు అంగీకరించగా వాళ్ళను ఆయన ఆశ్రమంలో ఉంచి కూర్ముడు వెళ్ళిపోయాడు. రాజు బ్రాహ్మణికి అన్ని సౌకర్యాలు చేసి ఆరు మాసాలకు కావలసిన భోజనసామగ్రి నిచ్చి ఆ గృహద్వారాన్ని బంధించాడు.

రెండు సంవత్సరాల తరువాత కాశీయాత్ర ముగించి కూర్మద్విజుడు రాజు దగ్గరకు వచ్చి తన భార్యను గురించి అడిగాడు. రాజు భయపడి "నీ భార్యా పుత్రులు వేంకటేశ్వర దర్శనంకోసం తిరుమలకు వెళ్ళారు" విశ్రాంతి తీసుకొమ్మని చెప్పి, అతని భార్యాపుత్రులను గురించి తన కుమారుడు శ్రీనివాసుని అడిగాడు. అంతట అతను వాళ్ళు మరణించారని చెప్పగా తొండమానుడు భయంతో తిరుమలకు వెళ్ళి స్వామితో ఈ విషయాన్ని మనవి చేసి రక్షించమని ప్రార్థించాడు. శ్రీనివాసుడు దయతో "చక్రవర్తీ! చనిపోయినవాళ్ళ అస్థికలను స్వామిపుష్కరిణికి తూర్పున ఉన్న



పాండవతీర్థంలో ముంచమని చెప్పాడు. రాజు అలాచేసిన వెంటనే బ్రాహ్మణి, ఆమె పుత్రుడు తిరిగి బ్రతికారు.

దేవతలు ఈ సంఘటనను చూచి అస్థినిమజ్జనంచేత చనిపోయిన వాళ్ళను బ్రతికించే ఈ తీర్థం అస్థితీర్థమౌతుందని పలికారు.

తొండమానుడు బ్రాహ్మణిని బిడ్డను కూర్మద్విజున కిచ్చి సత్కరించి పంపాడు.[34]

## బ్రహ్మాండపురాణం

బ్రహ్మాండపురాణం అస్థితీర్థ మాహాత్మ్యాన్ని కృష్ణశర్మ వృత్తాంతం ద్వారా ఇలా నిరూపిస్తుంది.

పూర్వం కృష్ణశర్మ అనే విప్రుడు తన భార్యను, కొద్దిరోజుల క్రిందట జన్మించిన శిశువును తీసుకొని తొండమానుని ఆస్థానానికి వచ్చి ఆయనతో ఇలా అన్నాడు. "రాజా! నేను చంద్రపురిలో నివసించే కూర్ముడనే విప్రుని పుత్రుణ్ణి. నాపేరు కృష్ణశర్మ" నేను కాశీకి పోతున్నాను. నా భార్యకు, మూడు నెలల ఈ బిడ్డకు నేను గంగా స్నానం చేసి వచ్చేదాకా ఆశ్రయమివ్వాలి.

తొండమానుడందుకంగీకరించగా కృష్ణశర్మ సుధర్మిణీ అనే తన భార్యను బిడ్డను ఆయన ఆశ్రయంలో ఉంచి గంగా స్నానానికి బయలుదేరి వెళ్ళాడు. కాశీయాత్ర ముగించుకొని కొంతకాలానికి కృష్ణశర్మ రాజు దగ్గరకు వచ్చి భార్యాబిడ్డలను గురించి అడిగాడు. రాజు వాళ్ళను గురించి విచారించగా ఆమె మరణించినట్లు సేవకులు చెప్పారు.

---

34. విస్మేరచిత్తాః సర్వేఽపి దృష్ట తత్తీర్థ వైభవాం: ॥
యదాతీర్థ ప్రభావేణ జీవితామృతకాశ్చతే ॥
తదాసర్వే సురారాజన్! బ్రహ్మరుద్రేన పూర్వకాః ।
అస్థితీర్థమితి ఖ్యాతం. తస్యనామ దదుర్ముదా ॥ భ.పు.14-152-153

తొండమానుడు కృష్ణశర్మతో– "బ్రాహ్మణోత్తమా నీ భార్య నా అనుమతితోనే దేవుణ్ణి పూజించడానికి వెళ్ళింది ఇప్పుడే వస్తుంది. విశ్రాంతి తీసుకో! అనిచెప్పి" వేంకటాచలానికి వెళ్ళ శ్రీనివాసుని ధ్యానించాడు. ఆయన ప్రత్యక్షమై తొండమానునితో ఇలా అన్నాడు "రాజా! నీవు భయపడకు! ఆమె ప్రాణాలు నా దగ్గరే ఉన్నాయి, ఇక్కడికి ఈశాన్యభాగంలో ఒక తీర్థం ఉంది. ఆ జలాన్ని తీసుకెళ్ళి సుధర్మిణిపైన, ఆమె బిడ్డపైన చల్లు. ఆమె, ఆ బిడ్డ తప్పక బ్రతుకుతారు. ఆ రాజు అలాగే చేయగా వాళ్ళు బ్రతకారు, కృష్ణశర్మకు వాళ్ళను అప్పగించి తొండమానుడు సంతోషించాడు.

ఇలా అస్థికలకు, ప్రాణం రప్పించిన తీర్థంకావడంవల్ల అప్పటినుంచి అది 'అస్థితీర్థం' అనేప్రసిద్ధిని పొందింది.[35]

## తుంబతీర్థం

తుంబ తీర్థానికే ఘోణ తీర్థమని ఇంకో పేరున్నది. దీని మాహాత్మ్యం వరాహ–బ్రహ్మ–స్కాంద–గరుడపురాణాల్లో వర్ణింపబడింది.

### వరాహపురాణం

తుంబతీర్థ మాహాత్మ్యాన్ని వరాపురాణం ఇలా పేర్కొంటున్నది.[36]

సూర్యుడు మీనరాశిలో ఉండగా పూర్ణిమనాడు ఉత్తర ఫల్గుణీ నక్షత్రంలో బ్రహ్మముహూర్త సమయంలో తెల్లవారు ఝామున పంచతీర్థాలకు గర్భస్థానమైన తుంబురు తీర్థంలో సాన్నంచేస్తే గర్భావాస దుఃఖంపోతుంది.

35. బ్రహ్మాండ.పు.తీ. 10–38–55.

36. మీన సంస్థే సవితరి పౌర్ణమా సీతిథౌధరే ।
ఉత్తరా ఫాల్గుణీ యుక్తే చతుర్ధేకాల సత్తమే ॥
పఞ్చనామః తీర్థానాం తుమ్భోఽథగిరిగహ్వరే।
యఃస్నాతి మనుజోదేవి పునర్గర్భే నజాయతే॥ (వ.పు.II.I. 64–65)



### బ్రహ్మపురాణం

బ్రహ్మపురాణం ఘోణ తీర్థమాహాత్మ్యాన్ని ఇలా వివరిస్తున్నది.

మీనమాసంలో పూర్ణిమనాడు వసిష్ఠుడు వేంకటాద్రికివెళ్ళి సర్వాబద్దునితో అక్కడికి విచ్చేసిన ఋషి, యక్ష, గంధర్వ, కింపురుషులతోను కలసిఘోణతీర్థంలో స్నానం చేసి శ్రీనివాసుణ్ణి ధ్యానించగా శ్రీదేవితో శ్రీవేంకటేశ్వరుడు ప్రత్యక్షమై ఇలా ఉపదేశించాడు.

"పూజ్యుడైన తుంబురుడు ఇక్కడ తపస్సు చేయడంవల్ల ఈ తీర్థానికి తుంబురు తీర్థమని ప్రసిద్ధి కలిగింది. ఇక్కడ స్నానం చేసిన వెంటనే సకల పాపాలు నశిస్తాయి. స్త్రీలుగాని, పురుషులుగాని పుణ్యదినాన ఇక్కడ స్నానం చేస్తే వారికి అభీష్టసిద్ధి కలుగుతుంది.

ప్రతి సంవత్సరం మీనమాసంలో పూర్ణిమనాడు ఈ తీర్థంలో స్నానం చేసినవాడు మూడులోకాల్లోను ధన్యుడౌతాడు. ఇక్కడ స్నానం చేస్తే పుత్రపౌత్రులు కల్గి చివరకు మోక్షాన్ని పొందుతారు.[37]

### స్కాందపురాణం

తుంబురు తీర్థాన్ని గురించి స్కాందపురాణం ఇలా వివరిస్తున్నది.

ఒకప్పుడు తుంబురుడు తన భార్యతో "మాఘమాసంలో ఘోణ తీర్థానికి వెళ్ళి అందులో స్నానం చేస్తే నీవు విష్ణుసాయుజ్యాన్ని పొందుతావు" అన్నాడు ఆ మాటకు ఆ గంధర్వకాంతకు కోపంవచ్చి కర్ణకఠోరమైన మాటలతో ఇలా అంది.

మహానుభావా! ఇంత చలగాలిలో ఎండలేని సమయంలో చలి అధికంగా ఉండే మాసంలో నే నెలాస్నానం చేస్తాను? నీవు చెప్పినట్లు నేను ప్రాతఃకాలంలో స్నానం చేయలేను. నేను చలికి చనిపోతే నీవు రక్షించగలవా?

37. బ్ర.పు 51.23–47.

ఆ మాటలకు చలించిపోయిన తుంబురుడు ధర్మకార్యాలు చేయడంలో ఆసక్తిలేని కొడుకును, భార్యను, ఆదరించని రాజును, వెంటనే శాపమిచ్చి దండించాలనే న్యాయాన్ననుసరించి ఇలా శపించాడు.

ఓ మూఢురాలా! మహాపవిత్రం, సకలదురితహరం అయిన వేంకటాచలంలో ఘోణతీర్థంలో ఉన్న రావిచెట్టు తొర్రలో నీళ్ళు లేనిచోట కప్పవై ఉందువుగాక".

ఆ మాటలను విని ఆమె నాకెప్పుడు శాపవిమోచనం కలుగుతుందని అతని కాళ్ళపైబడి ప్రార్థించగా "అగస్త్యుడు ఘోణ తీర్థంలో స్నానం చేసి రావిచెట్టు కింద శిష్యులకు తీర్థమాహాత్మ్యాన్ని వినిపించినప్పుడు నీకు సకల పాపాలు నశించి శాపవిమోచనమౌతుందని" బదులు చెప్పాడు. తుంబురు శాపాన్ననుసరించి ఆమె వెంటనే రావిచెట్టు తొర్రలో కప్పగా అయింది. చాలాకాలం తరువాత అగస్త్యుడు వేంకటాచలానికి వెళ్ళి ఘోణతీర్థంలో స్నానంచేసి శిష్యులకు దాని మాహాత్మ్యాన్ని వినిపిస్తాడు. అంతట ఆమెకు కప్పరూపం పోయి గంధర్వజన్మ లభిస్తుంది. ఆమె భక్తితో అగస్త్యునికి, శిష్యులకు నమస్కరించి వెళ్ళిపోతుంది. అప్పటినుంచి ఈ తీర్థానికి తుంబురు తీర్థమనే పేరేర్పడింది.[38]

**గరుడ పురాణం**

గరుడపురాణంలో శ్రీనివాసుడు అరుంధతికి తుంబురు తీర్థమాహాత్మ్యాన్ని ఇలా వివరించాడు.

"అరుంధతీ! వేంకటాద్రిపై గల తుంబురుతీర్థంలో స్నానం చేస్తే పాపాలు తప్పక నశిస్తాయి, స్త్రీ, పురుషులు ఎవరు ఏ కోరికతో స్నానం చేస్తే వారి కాకోరిక సిద్ధిస్తుంది. స్నానం చేసిన వారి కష్టాలన్నీ వెంటనే నశిస్తాయి. ఈ

38. స్కాం.పు I.16.



విషయాన్ని విన్నా ధ్యానించినా ఘోణతీర్థ స్నానంవల్ల కలిగే పుణ్యం లభిస్తుంది.[39]

## ఆకాశగంగాతీర్థం

ఆకాశగంగా తీర్థమాహాత్మ్యాన్ని వరాహ-పద్మ-స్కాంద పురాణాల్లోని వేంకటాచలమాహాత్మ్యం వర్ణిస్తున్నది.

వరాహపురాణం ఆకాశగంగా మాహాత్మ్యాన్ని ఇలా తెలియ చేస్తున్నది. సూర్యుడు మేషరాశిలో ఉండగా చిత్తా నక్షత్రంలో కలిసిన పూర్ణిమనాడు ప్రాతఃకాలంలో ఆకాశగంగలో స్నానం చేస్తే మోక్షం లభిస్తుంది.[40]

**పద్మపురాణం**

పద్మపురాణంలోని క్షేత్రకాండ ఆకాశగంగా మాహాత్మ్యాన్ని ఇలా తెలియ చేస్తున్నది.

ఆకాశగంగా తీర్థం సమస్తాభీష్టాలను కలిగిస్తుంది. ఇందులో స్నానం చేసిన వాళ్ళు సంసార సాగరాన్ని తేలికగా దాటగలుగుతారు. ప్రతిదినం ఇందులో దేవతాస్త్రీలు, నాగకన్యలు, గంధర్వకన్యలు, కిన్నరాంగనలు, వైఖానసాంగనలు స్నానం చేస్తూంటారు.[41]

**స్కాందపురాణం**

స్కాందపురాణం ఆకాశగంగా మాహాత్మ్యాన్ని ఇలా అభివర్ణిస్తున్నది.

39. ఇతి సర్వం వరందత్వాఽన్తర్దధే వేంకటేశ్వరః ।
యః ఇదం పఠతి ధ్యాయన్ శృణుయాచ్చ సమాహితః ।
ఘోణతీర్థ స్నానఫలం ప్రాప్నోతి హి న సంశయః॥ (గ.పు. 63.61.62.)

40. వ.పు. II. 1.66.

41. పా.పు.క్షే. 24.52-54.

పూర్వం గోదావరీ తీరంలో ధర్మశీలుడు, గురుభక్తిపరాయణుడు, పుణ్యశీలుడున్నాడు. అతడు ఒకప్పుడు శ్రోత్రియుడైన బ్రాహ్మణుని భోక్తగాపెట్టి పితృశ్రాద్ధాన్ని నిర్వహించాడు. కొంతకాలం తరువాత పుణ్యశీలునకు గాడిదముఖం వచ్చింది. అతను అనేక విధాల బాధపడి సువర్ణముఖీ తీరంలోగల అగస్త్యాశ్రమానికి వెళ్ళి ఆయనకు నమస్కరించి మహర్షీ! ఏ దోషంవల్ల నాకీ కుత్సితరూపం వచ్చిందో తెలియజేయమని ప్రార్థించాడు.

అగస్త్యుడప్పుడు " ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! నీవు వేదవేదాంగములు చదివిన వాడైనా, సంతానం లేనివాడిని భోక్తగా నియమించి శ్రాద్ధం పెట్టావు. నీ కందువల్ల గాడిదముఖం ఏర్పడింది. ఈ దోషం పోవాలంటే సువర్ణముఖీ తీర్థం సమీపంలో వేంకటాచలంపైన ఆకాశగంగా తీర్థంలో స్నానం చేయి. నీకీ గార్ధభ ముఖం పోతుంది" అన్నాడు.

అగస్త్యుని ఆజ్ఞననుసరించి పుణ్యశీలు డలాగే ఆకాశగంగలో స్నానం చేశాడు. వెంటనే గర్ధభ ముఖం పోయి అందమమైన ముఖమేర్పడింది.[42]

## చక్రతీర్థం

చక్రతీర్థ మాహాత్మ్యం స్కాందపురాణంలో మాత్రమే వర్ణితం.

ఒకప్పుడు వీరబాహువు పుత్రుడు, బలవంతుడైన సుందరుడనే గంధర్వుడు వందమంది స్త్రీలతో కలసి దిగంబరుడుగా కావేరినదిలో పరవశుడై క్రీడిస్తున్నాడు. ఇంతలో వసిష్ఠమహర్షి ఇతర మునులతో కలసి కావేరీనదిలో మాధ్యాహ్నిక సంధ్యావందనం పూర్తిచేసికొని శ్రీరంగనాథ మందిరానికి వెళుతున్నాడు. వాళ్ళను చూసి స్త్రీలు గుడ్డలు కప్పుకున్నారు. సుందరుడు మాత్రం అలా చేయకుండా నగ్నంగానే ఉన్నాడు. వసిష్ఠుడతణ్ణి చూసి ఇలా శపించాడు.

42. స్కాం.పు 12.23-55.



"ఓ గంధర్వా ! నీవు మమ్మల్ని చూసికూడా దిగంబరిగానే ఉన్నావు కనుక వెంటనే రాక్షసుడవై పోదువుగాక!"

వసిష్ఠుని శాపానికి భయపడిన ఆ స్త్రీలందరు మహర్షిని శాపవిమోచనాన్ని అనుగ్రహించమని ప్రాధేయపడ్డారు. తరువాత శాంతుడైన వసిష్ఠుడు ఇలా శాపవిమోచనాన్ని తెలియజేశాడు–నా శాపాన్ని పదహారు సంవత్సరాలు అనుభవించిన తరువాత–మీభర్త చక్రతీర్థసమీపంలో పద్మనాభుడనే తపశ్శాలిని మింగడానికి వస్తాడు. అప్పుడు శ్రీమన్నా రాయణుని చక్రం అతణ్ణి సంహరిస్తుంది. అంతటితో శాపవిముక్తి జరిగి తిరిగి గంధర్వుడౌతాడు.

### పద్మనాభవృత్తాంతం

పూర్వం శ్రీవత్సగోత్రుడు పద్మనాభుడనే విప్రుడు చక్రతీర్థంలో ఆహారం తినకుండా సత్యాన్నే పలుకుతూ ఇంద్రియాలను జయించి, కొన్ని సంవత్సరాలు ఎండుటాకుల్ని తిని, ఇంకొన్ని సంవత్సరాలు నీళ్ళుత్రాగి, మరికొన్ని సంవత్సరాలు గాలిని మాత్రమే భుజించి మొత్తం పన్నెండు సంవత్సరాలు ఘోరమైన తపస్సు చేశాడు. అతని తపస్సుకు శ్రీమహావిష్ణువు తృప్తిపడి ప్రత్యక్షమై ఇలా అన్నాడు.

"ఓ పుణ్యవంతుడా! కల్పాంతందాకా నీవు ఈ చక్రతీర్థంలోనే నివసించు" తరువాత విష్ణువు అంతర్ధానమౌతాడు. ఇలా శ్రీమన్నారాయణుని' ఆజ్ఞవల్ల పద్మనాభుడు అక్కడే నివసిస్తుండగా కొంత కాలానికి భయంకరుడైన రాక్షసుడొకడు ఆకలి బాధను తట్టుకోలేక పద్మనాభుణ్ణి భుజించాలని వచ్చాడు, పద్మనాభుడు శ్రీహరిని ప్రార్థించగా, చక్రాయధంతో రాక్షసుణ్ణి ఆయన సంహరించాడు. చక్రాయుధం పద్మనాభునిచేత స్తుతించబడి నేను నీదగ్గరనే ఎప్పుడూ ఉంటానని పుష్కరిణిలో ప్రవేశించింది.[43]

43. స్కాం.పు.II.37.36-91.

## కటాహతీర్థం

స్కాందపురాణం కటాహతీర్థమాహాత్మ్యాన్ని ఇలా వర్ణించింది.

పూర్వం తుంగభద్రానదీ తీరంలో 'వేదాఢ్య' అనే అగ్రహారం ఉండేది. అందులో పద్మనాభుడనే పండితుడు ఉండేవాడు. అతని కుమారుడు కేశవుడు. అతను సత్కర్మలను వదిలేసి భార్యను, తల్లిదండ్రులను లెక్కచేయకుండా వేశ్యాగృహంలో నివసించేవాడు. ఒకరోజు కిరాతులతో దొంగతనానికి వెళ్ళాడు. ఒక బ్రాహ్మణుని ఇంట్లోపడి కత్తితో అతణ్ణి చంపి ద్రవ్యాన్ని అపహరించి మరల వేశ్యాగృహానికే వెళ్ళాడు. బ్రాహ్మణుడై ఉండికూడా వైదిక కర్మల నాచరించకుండా భ్రష్టమైన ఆ కేశవుణ్ణి నల్లని వస్త్రాన్ని ధరించి బాగా ఎర్రగా ఉన్న తలవెంట్రుకలతో భయంకరంగా ఉన్న బ్రహ్మహత్య నవ్వుతూ గర్జిస్తూ భయపెట్టింది. ఆ భయంతో అతడు భూమి అంతా తిరిగాడు. చివరకు స్వగ్రామంలోని తన ఇంటికి చేరి తండ్రిని రక్షించమని ప్రార్థించాడు.

తండ్రి భయపడవద్దని కేశవునికి అభయమిచ్చి రక్షించడానికి పూనుకున్నాడు. అప్పుడు బ్రహ్మహత్య కేశవుని తండ్రితో ఇలా అన్నది.

పద్మనాభా ! ఇతను కల్లు తాగినవాడు, పాపాత్ముడు, అలాంటి వీణ్ణి నీవు రక్షిస్తే మిమ్ముల్నందరిని నేను తినేస్తాను. దానికి పద్మనాభుడు ఇలా అన్నాడు. నేను పుత్రవాత్సల్యంతో బాధపడుతున్నానన్నాడు. అంతలో బ్రహ్మహత్య కేశవుని అరచేతిలో గట్టిగా కొట్టింది. ఆ సమయంలో వారి అదృష్టంవల్ల అక్కడికి భారద్వాజ మహర్షి వచ్చాడు. పద్మనాభుడు మహర్షిని స్తుతిచేసి బ్రహ్మహత్య నివారణోపాయం సెలవివ్వమని ప్రార్థించాడు. పద్మనాభునితో భరద్వాజుడిలా అన్నాడు.

పద్మనాభా! నీకొడుకు ఘోరమైన పాపం చేశాడు. దానికి ప్రాయశ్చిత్తం చెబుతాను విను. గంగానదికి దక్షిణభాగంలో రెండు వందల యోజనాల దూరంలో తూర్పు సముద్రానికి పశ్చిమంలో సువర్ణముఖికి ఉత్తరాన రెండుమైళ్ళ దూరంలో పవిత్రమైన వేంకటాచలం ఉంది. అక్కడ శ్రీనివాసుడవతరించాడు. ఆయన ఆలయానికి ఉత్తరాన కటాహతీర్థమనే పవిత్రమైన సరస్సు ఉంది. ఆ జలాన్ని నీకొడుకుకు తాగిస్తే బ్రహ్మహత్య అతన్ని విడిచిపోతుంది."



తరువాత పద్మనాభుడు కేశవుణ్ణి వేంకటాచలానికి తీసుకవెళ్ళి స్వామి పుష్కరిణిలో స్నానం చేయించి, కటాహతీర్థం తాగించాడు. బ్రహ్మహత్య అతణ్ణి వదిలేసింది.[44]

## మన్వాద్యష్టోత్తరశతతీర్థాలు

బ్రహ్మపురాణం వేంకటాచలానికి నైరృతి దిగ్భాగంలో నూట ఎనిమిది తీర్థాలున్నట్లు తెలియజేస్తున్నది.

అవి– 1.మను 2.ఇంద్ర 3.వసు 4.రుద్ర 5.సూర్యనామకాలు నవబ్రహ్మలు 6.అశ్వినుల పేరున్నవి 7.శుక్రుని పేర్లున్నవి 8.వరుణ 9.జాహ్నవి 10.కాపేయ 11.కాణ్వ 12.ఆగ్నేయ 13.నారద 14.సోమ 15.భార్గవ 16.ధర్మ 17.యజ్ఞ 18.పశు 19.గణేశ్వర 20.భౌమాశ్వ 21.పారిభద్ర 22.జగజ్జాద్యహర 23.విశ్వకల్లోల 24.యమనిర్మిత 25.బార్హస్పత్య 26.రోమహర్ష 27.అజామోద 28.జనేశ్వర 29.ఇష్టసిద్ధి 30.కర్మసిద్ధి 31.వాట 32.ఔదుంబర 33.కార్తికేయ 34.కుబ్జతీర్థ 35.దశప్రాచేత 36.గారుడ 37.శేష 38.వాసుకి 39.విష్ణువర్ధన 40.కర్మకాండ

44. తం గత్వా వేంకటశైలం స్వామి పుష్కరిణీజలే ।
సుతేన సాకం విప్రేన్ద్రః సస్నానియమ పూర్వకమ్ ॥
పద్మనాభోऽథ పుత్రేణ కేశవేన దురాత్మనా।
పపౌ కటాహ తీర్థం తత్ బ్రహ్మహత్యా వినాశనమ్ ॥
తదానీం బ్రహ్మహత్యా సా శీఘ్రమేవలయంగతా స్కాంద.పు. II. 37. 82–85.

41.పుణ్యవృద్ధి 42.ఋణవిమోచన 43.పర్జన్య 44.మేఘ 45.సాంకర్షణ 46.వాసుదేవ 47.నారాయణ 48.దేవ 49.యక్ష 50.కాల 51.గోముఖ 52.ప్రద్యుమ్న 53.రుద్ర 54.పితృ 55.ఆర్షేయ 56.వైశ్వదేవ 57.అస్థి 58.ఆంజనేయ 59.శుద్ధోదక 60.అష్టభైరవాది తీర్థాలు.[45]

దక్షపుత్రులు నూరుగురు నారదోపదేశంతో తపస్సుచేసి అభీష్ట ప్రదాయినులైన వెయ్యి అస్థి తీర్థాలను నిర్మించారని ఈ పురాణంద్వారా తెలుస్తున్నది.[46]

## రామకృష్ణతీర్థం

స్కాంద పురాణం రామకృష్ణ తీర్థప్రశంస ఇలా చేస్తున్నది. పూర్వం రామకృష్ణుడనే విప్రుడు వేంకటాచలంలో శ్రీమహావిష్ణువుని ధ్యానిస్తూ తపస్సు చేశాడు. అతనక్కడ నిత్యం స్నానం చేయడానికొక సరస్సును నిర్మించుకున్నాడు, అందులో స్నానం చేసినవాడు సకల పాపాలనుంచి విముక్తుడౌతాడు. రామకృష్ణుడు పరమధార్మికుడు, ఇంద్రియ నిగ్రహంతో తను కూర్చున్న ప్రదేశం నుంచి కదలక తపస్సాచరిస్తుండగా అతనిపై పుట్టలు పెరిగినాయి. అతను తపస్సునుంచి విరమించలేదు. ఇంద్రుడు కాలమేఘాలను పంపి పదిరోజులు విరామం లేకుండా వర్షం కురిపించాడు. అయినా రామకృష్ణుడు చలించలేదు. ఆ పుట్టపైన పిడుగుపడింది. అప్పుడు శ్రీనివాసుడతనికి ప్రత్యక్షమై ఇలా వరమిచ్చాడు–తపోనిధీ! రామకృష్ణా! నేను అవతరించిన రోజున ఈ తీర్థంలో స్నానం చేసినవాళ్ళకు అనంతపుణ్యం కలుగుతుంది. ఆ ఫలాన్ని వర్ణించడం ఆదిశేషునికి కూడా శక్యం కాదు.

45. బ్ర.పు 7. 1–10.
46. బ్ర.పు.7.11–13.



సూర్యుడు మకర రాశిలో ఉన్నప్పుడు పూర్ణిమనాడు పుష్యమీ నక్షత్రంలో రామకృష్ణతీర్థంలో స్నానం చేయడం పుణ్యప్రదం. ఆ రోజు ఇందులో ఎవరు స్నానం చేస్తారో వాళ్ళకు పాపాలు నశించి సకలాభీష్టాలు నెరవేరుతాయి.[47]

## శంఖ తీర్థం

సువర్ణముఖీ నదికి దగ్గరలో శంఖతీర్థం ఉంది. ఇందులోని జలం సకల దోషహారం. ఇది దేవతలచేత సేవించబడుతున్నదని స్కాందపురాణం వర్ణిస్తున్నది.

ఈ తీర్థంలో శంఖుడనే యోగి ప్రతిష్ఠించిన శంఖేశుడు లింగాకారంలో విలసిల్లుతున్నాడు. ఈ తీర్థంలో స్నానంచేసి వృషభవాహనుడైన శంకరుణ్ణి దర్శిస్తే నూరు అశ్వమేధయాగాలు చేసిన పుణ్యం కలిగి దేవలోకాన్ని పొందుతారు.[48]

## కల్యా తీర్థం

కల్యాతీర్థం వృషభాచలంలో పుట్టింది. ఇది శ్రేష్ఠమైన తీర్థం. సర్వపాప నాశకరం. ఇది సువర్ణముఖీ కలసి ప్రవహించి గయలో చేరుతుందని స్కాంద పురాణం అభివర్ణిస్తున్నది.[49]

47. స్కాం.పు 5.19–26
48. అందులోనే III 6.42–46
49. సువర్ణముఖరీం తత్ర సజ్గతామజ్గళప్రదా ।
కల్యానామనదీ పుణ్యాకాళిన్దీ జాహ్నవీమివ ॥
వృషభాచల సమ్భూతా తీర్థరాజ విరాజితా ।
నదీనాముత్తమా కల్యా కలుషాఘ వినాశినీ ॥ స్కాందపురా.III.7.1.2.

## శక్రతీర్థం

కపిలతీర్థానికి పైభాగాన వేంకటాచలంపైన ఈ తీర్థం ఉన్నది. వరాహ పురాణం ఈ తీర్థ ప్రశంస చేస్తున్నది. అహల్య సంగమంవల్ల దేవేంద్రునకు వచ్చిన శాపం ఈ తీర్థ స్నానంవల్ల పోవడంచేత, దీనికి శక్రతీర్థమనే పేరు వచ్చింది.[50]

## విష్వక్సేనతీర్థం

శక్రతీర్థానికి పై భాగంలో విష్వక్సేనతీర్థం ఉందని వరాహపురాణం తెలియజేస్తున్నది.

పూర్వం వరుణపుత్రుడు గొప్ప తపస్సుచేసి శ్రీహరి సారూప్యాన్ని,సేనాధి పతిత్వాన్ని పొందిన దివ్య ప్రదేశమే విష్వక్సేన తీర్థంగా రూపొందిందని వరాహపురాణం పేర్కొంటుంది.[51]

## పంచాయుధ తీర్థాలు

విష్వక్సేన తీర్థానికి పైభాగంలో పంచాయుధ తీర్థాలున్నాయని వరాహపురాణం చెబుతోంది.[52]

## బ్రహ్మతీర్థం

పంచాయుధ తీర్థాలకు ఇంకా పైన బ్రహ్మతీర్థం ఉందని వరాహపురాణం వివరిస్తుంది. ఈ తీర్థం బ్రహ్మహత్యాది దోషాలను పోగొట్టి పుణ్యాన్ని వృద్ధిచేస్తుంది.[53]

50. వరాహ.పు I. 40.8.9
51. తదూర్ధ్వదేశే శక్రస్యతీర్థం పరమపావనమ్ ।
  వరుణస్యాऽత్మజోయత్రతపః కృత్వాసుదుస్తరమ్
  సారూప్యం చ హరేః ప్రాప్యసైనాపత్య మవాపహి ॥ (వరాహ.పురాణం I 40.8-10)
52. వరాహ. పు I.40.11
53. అందులోనే I 40.12



## సప్తర్షితీర్థాలు

బ్రహ్మతీర్థానికి ఇంకాపైన సప్తర్షి తీర్థాలున్నాయని వరాహపురాణం తెలియజేస్తున్నది.[54]

## వ్రతతీవర్తనీ తీర్థం

పద్మపురాణం ఈ తీర్థాన్ని గురించి ఇలా వివరిస్తున్నది, నారాయణాద్రి పై వ్రతతీవర్తనీ తీర్థం ఉంది. శుకయోగీంద్రుడు ఈ తీర్థంలో స్నానం చేసిననట్లు ఈ పురాణం పేర్కొంటున్నది.[55]

### స్వామిపుష్కరిణి

స్వామిపుష్కరిణి అనే తీర్థం వేంకటాచలంపైన ఉంది. ఇది వైకుంఠం నుంచి గరుడుడు తీసికొనివచ్చిన క్రీడాపర్వతంలో శ్రీభూదేవులకు క్రీడా సరస్సుగా ఉన్నట్లు చెప్పబడింది.

దీని ప్రస్తావన వరాహ- పద్మ- మార్కండేయ- వామన- స్కాంద- బ్రహ్మ-భవిష్యోత్తర పురాణాలలో కనబడుతున్నది. వేంకటాచలంలో ఉన్న మూడుకోట్ల తీర్థాలకు ఈ పుష్కరిణి అవతారస్థానంగా పేర్కొనడమైనది.

### ఉత్పత్తి

శ్వేత వరాహరూపంలో భూమిని ఉద్ధరించిన విష్ణువు భూలోకంలో కొంతకాలం నివసించదలచి గరుడుని పంపి వైకుంఠంనుంచి క్రీడాచలాన్ని తెప్పించుకున్నాడు. అందులో శ్రీ భూలాలితమైన క్రీడావాపి ఒకటి ఉంది.

54. మునీనాం చైవ సప్తానాం పుణ్యతీర్థాని సన్త్యతః ।
  దశాధిక ఫలం తేషాం తీర్థానా ముత్తరోత్తరమ్ ॥ (వ.పు.I.40-13)
  ఫలతేషాం తీర్థానా ముత్తరోత్త రమ్॥
55. ప.పు.క్షే రమ్ ॥ 24.55-56

అది దివ్యజలంచే నిండి గంగాది సర్వతీర్థాలకు ఉత్పత్తి స్థానంగా ఉండేదని వరాహపురాణం పేర్కొంటున్నది.[56]

**శబ్దార్థం**

ప్రపంచంలో ఉన్న తీర్థాలన్నింటికి వేంకటాచలంలో ఉన్న పుష్కరిణి స్వామిని కాబట్టి దీన్ని స్వామిపుష్కరిణి అన్నారు.

“స్వామినీ చాసౌ పుష్కరిణీ చ స్వామిపుష్కరిణీ” అని వ్యుత్పత్తి.[57]

**వర్ణనం**

స్వామిపుష్కరిణిని పురాణాలిలా వర్ణిస్తున్నాయి. అశోక, పున్నాగ, పొగడచెట్లతో శోభించేది, రమణీయోపవనాలచే సంవేష్టితమైనది, ఎర్రకలువలతో ప్రకాశించేది. ముత్యాలతో తాబేళ్ళతో నిండినది, అనేక లతలతో కూడినది, ఆడ, మగ నెమలి కూతలచేత మనోహరమైనది, మాదీఫల బొద్దుగు, తెల్లగన్నేరు, ఎర్రగన్నేరు, ఖదిరాది వృక్ష సందోహాలతో శోభించేది, ఏడాకుల అరటిచెట్లతోను మొగలి పొదలతోను ప్రకాశించేదిగా స్వామిపుష్కరిణి వేంకటాచలమాహాత్మ్యంలో ఎంతో విస్తారంగా వర్ణితం![58] ఇది ఒకనాటి పుష్కరిణీ స్వరూపం ఈనాటి స్వరూపం దీనికి పూర్తిభిన్నంగా ఉంది.

56. వైకుంఠా ద్భగవత్క్రీడావాపీ శ్రీభూమిలాలితా।
అప్రాకృత జలౌఘాచ సుగన్ధా సుమనోహరా ॥
గంగాది సర్వతీర్థానాం జన్మభూమి శ్శుభోదకా ।
ఆ నీ తావైనతేయేన క్రీడార్థం తత్రతిష్ఠతి ॥ (వ.పు.I.35.17–18)

57. స్వామిపుష్కరిణీ శబ్దోరూఢస్తస్మిన్ సరోవరే ।
వ్యుత్పత్తిః కధితా తస్యాస్తీర్థానాం స్వామినీ యతః ॥
స్వామిపుష్కరిణీత్యేవ తస్మాత్పూర్వం పురాతనై ః ।

58. భవి.పు.3.1–8.



**ప్రభావం**

శ్రీమన్నారాయణుని క్రీడార్థం శ్రీవైకుంఠం నుంచి తీసుకొని రాబడిన పుష్కరిణీ ప్రభావం వర్ణనాతీతమైంది. ఇది గంగాది సర్వతీర్థాలకు జన్మస్థానం. పరిమళాలు వెదజల్లే పవిత్రమైన జలంతో విరజానదిలాగా సర్వపాపాలను పోగొట్టజాలింది. స్వర్ణ చౌర్యం, సురాపానం మొ॥వాటివల్ల కలిగే పాపాలు దాని స్నానంవల్ల నశించిపోతాయి.

దీని దర్శనం, స్పర్శనం, స్మరణం కూడా సర్వాభీష్టాలను అనుగ్రహిస్తుంది. ప్రాతఃకాలంలో స్వామిపుష్కరిణిని స్మరించినవాళ్ళకు ఉత్తమ లోకాలు సంప్రాప్తిస్తాయి.

మార్గశిరశుద్ధ ద్వాదశినాడు అరుణోదయవేళలో మూడున్నరకోటి తీర్థాలు స్వామిపుష్కరిణిలో ప్రవేశిస్తాయి. ఇందులో చేరడంవల్ల ఆ తీర్థాల పాపాలన్నీ నశించిపోతాయని వరాహ–వామన పురాణాలు తెలియజేస్తాయి.[59]

**స్నానమహిమ**

స్వామిపుష్కరిణీస్నానం సర్వాభీష్టఫలప్రదం. ఎవరు ఏ కోరికతో ఇందులో స్నానంచేస్తే ఆ కోరిక వాళ్ళకు త్వరగా సిద్ధిస్తుంది.

స్వామిపుష్కరిణిలో స్నానం చేయడం, సదాచార్యులకు శుశ్రూషలు చేయడం ఏకాదశీవ్రతం, అనేమూడు ఎంతో దుర్లభమైనవి. అందరికి లభించేవి కావు. మానవజన్మ అత్యంత దుర్లభమైనదని వరాహపురాణం ఇలా వివరిస్తున్నది.

59. వా.పు క్షే. 30.43–53

**స్వామిపుష్కరిణీ స్నానం సద్గురోః పాదసేవనమ్।**
**ఏకాదశీవ్రతం చాపి త్రయమత్యన్తదుర్లభమ్॥**
**దుర్లభం మానుషం జన్మదుర్లభం తత్రజీవనమ్।**
**స్వామి పుష్కరిణీ స్నానం త్రయమత్యన్త దుర్లభమ్॥** [60]

పుష్కరిణీ స్నానం సర్వపాతక నిర్మూలనమని తారకవధ చేసిన కార్తికేయుడు దీనిలో స్నానం చేయడంవల్ల నిరూపితమైనది.

స్కాంద-భవిష్యోత్తర పురాణాలు స్వామిపుష్కరిణిలో స్నానం చేయాల్సిన సమయాన్ని ఇలా నిర్ణయిస్తున్నాయి.

ధనుర్మాసంలో శుద్ధద్వాదశినాడు సూర్యోదయానికి ముందుగా తీర్థాలన్నీ స్వామిపుష్కరిణిలో వచ్చి చేరుతాయి. ఆ సమయంలో పుష్కరిణీ స్నానం చేస్తే మోక్షం తప్పక లభిస్తుంది. వెయ్యి జన్మల పుణ్యం గలవాడికైనా ఇక్కడ స్నానం చేయడం దుర్లభం. [61]

**భక్తుల వృత్తాంతాలు**

స్వామిపుష్కరిణిలో స్నానం చేసిన వారి వారి అభీష్టాలను పొందిన భక్తుల్ని గురించి వరాహ-భవిష్యోత్తర-స్కాంద పురాణాలు ఇలా వివరిస్తున్నాయి.

**వరాహపురాణం**

స్వామిపుష్కరిణిలో స్నానంచేసి రాజ్యాన్ని తిరిగిపొందిన శంఖణుడనే రాజు, దశరథుడు, రాముడు మొ॥వాళ్ళ వృత్తాంతాలు వరాహపురాణంలో అభివర్ణితం.

60. వ.పు1.36.24.26

61. ధనుర్మాసే సితే పక్షే ద్వాదశ్యా మరుణోదయే ।
కాంక్షన్తి విబుధశ్రేష్ఠాః మజ్జనం తజ్జలే శుభే॥ (భ.పు.3.4)



ఒకప్పుడు చంద్రవంశీయుడైన శంఖణుడనే రాజు రాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు. హఠాత్తుగా అతని రాజ్యాన్ని సామంతులు అపహరించారు. భార్యతోను, మంత్రులతోను, అతణ్ణి దేశాన్నుంచి బహిష్కరించారు. ఆయన దుఃఖంతో దక్షిణదిక్కుకు వచ్చి సేతుదర్శనం చేసుకొని, అందులో స్నానంచేసి, సువర్ణముఖిలోను, దానికి ఉత్తరంలో ఉన్న పద్మసరోవరంలోను స్నానంచేసి, సంధ్యాదికాలను పూర్తిచేసి రాజ్యం పోయిందనే దుఃఖంతో చింతిస్తూ నిద్రించాడు. నిద్రలో అశరీరవాణి అతనికిట్లు వినిపించింది.

“ఓ మహాత్మా! నీవు ధైర్యంగా ఉండు! ఇక్కడికి ఒక క్రోసు దూరంలో వేంకటాచలం ఉన్నది. నీవక్కడికి వెళ్ళి స్వామిపుష్కరిణిలో మూడు వేళల స్నానంచేసి ఆరుమాసాలు స్వామిని ఆరాధిస్తే మరల నీకు రాజ్యం లభిస్తుంది.”

రాజు అశరీరవాణి మాటలను విని నిద్రలేచి నిర్మలమైన మనస్సుతో పవిత్రమైన వేంకటాచలానికి వెళ్ళి స్వామిపుష్కరిణి తీర్థంలో కుటీరాన్ని నిర్మించుకొని ఆరునెలలు తపస్సు చేశాడు. ఒకనాడు పుష్కరిణి మధ్యభాగంలో దివ్య విమానంలో పరాత్పరుడైన శ్రియఃపతిని శ్రీభూనీళాదేవులతో దర్శించి స్తుతించాడు. భగవానుడు శంఖణుడితో ఇలా అన్నాడు.

“రాజా! నీవు విచారించవద్దు. నీ రాజ్యం త్వరలో నీకు లభిస్తుంది. ఇదంతా స్వామిపుష్కరిణీ స్నానప్రభావం. నీవు స్వదేశానికి వెళ్ళి రాజ్యం పాలించుకో” అని అదృశ్యుడైనాడు.

శంఖణుడు స్వామి మాటలకు సంతోషపడి భార్యతో మంత్రులతో వేంకటాచలంనుంచి తన దేశానికి వెళ్ళాడు. సామంతులు ఒకళ్ళ నొకళ్ళు హింసించుకొని నశించగా ప్రజలు శంఖణుడే రాజ్యాన్ని పరిపాలించాలని ఆయనకే అభిషేకం చేశారు.

ఈ వృత్తాంతం భవిష్యోత్తర-వామన పురాణాల్లో కూడా వర్ణితం.

**దశరథవృత్తాంతం**

పూర్వం ధర్మాత్ముడైన దశరథ మహారాజు అయోధ్య రాజధానిగా భూమిని పరిపాలించాడు. ఎన్ని రాజ్యసుఖాలున్నా సంతానం కలగలేదనే వేదన అతణ్ణి కుంగదీసింది. కులగురువైన వసిష్ఠుని ప్రేరణతో ఆయన వేంకటాచలానికి వచ్చి స్వామిపుష్కరిణిలో స్నానం చేసి శ్రీమహావిష్ణువుని అష్టాక్షరీ మంత్రాన్ని జపిస్తూ కొంతకాలం తపస్సు చేశాడు. ఇంతలో ఒకరోజు గొప్ప తేజస్సుగల ఒక దివ్యవిమానం ప్రత్యక్షమైంది. దేవతలు, మహర్షులతో తనుకూడా అందులో శ్రీమన్నారాయణుని దర్శించి నాలుగు శ్లోకాలతో స్తుతించాడు. శ్రీమహావిష్ణువు దశరథునితో. నీవు నాలుగు శ్లోకాలతో స్తోత్రం చేశావు గనుక నీకు నలుగురు బలాఢ్యులైన పుత్రులు కలుగుతారా"ని వరమిచ్చాడు. తరువాతనే దశరథునికి నలుగురు సంతానం కలిగారు.[62]

**ఆత్మారామ వృత్తాంతం**

పూర్వం మధ్యదేశంలో ఆత్మారాముడనే విప్రుడుండేవాడు. తండ్రి నుంచి వచ్చిన సిరిసంపదల్ని పోగొట్టుకొని, కులవృత్తిలేక, అనేక దుఃఖాల్ని అనుభవిస్తూ అనుకోకుండా వేంకటాచలానికి వచ్చి, కపిలతీర్థంలో స్నానంచేసి వేంకటాచలాన్ని ఎక్కి, సనత్కుమారుణ్ణి దర్శించి ఇలా అన్నాడు.

"ఓ! తపోధనా! నేను పాపాత్ముణ్ణి. నాదారిద్ర్య బాధతీరే ఉపాయం ఏదైనా సెలవివ్వండి." సనత్కుమారుడు అతని ప్రార్థన విని ఇలా అన్నాడు.

"నాయనా! నీవు పూర్వజన్మలో ఘోరపాపాలు చేశావు. దానాలు చెడగొట్టావు. సుఖంగా ఉన్నవాళ్ళను అనేక విధాలు బాధలుపెట్టావు. నీవు గోదాన, భూదాన, వస్త్రదానాలలో ఏ ఒక్కటి చేయలేదు. కనుక ఈ దుర్భర

62. వ.పు I.49.46-53.



దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నావు. ఈ బాధలు తీరడానికి ఒకే ఒక ఉపాయం ఉంది. శ్రీహరి ప్రియజగన్మాత అయిన లక్ష్మిని ధ్యానిస్తూ స్వామిపుష్కరిణిలో స్నానం ఆచరించు".

ఆ మాటలు విని ఆత్మారాముడు అలాగే పుష్కరిణీస్నానం చేయగా శ్రియఃపతి ప్రత్యక్షమై."నీ పాపం నశించిపోయింది. నీకు ఐశ్వర్యం, దీర్ఘాయువు, జ్ఞానాన్ని ఇస్తున్నాను." అని వరమిచ్చి అదృశ్యమైనాడు.[63]

**భవిష్యోత్తరపురాణం**

**శంఖణవృత్తాంతం**

భవిష్యోత్తరపురాణం స్వామి పుష్కరిణీ మహాత్మ్యాన్ని తెలియజేస్తూ శంఖణ వృత్తాంతాన్ని పేర్కొంటున్నది.[64]

**నారాయణ వృత్తాంతం**

అలాగే ఆంగిరస పుత్రుడు నారాయణుడు స్వామిపుష్కరిణీ స్నాన మహిమచేత పరమపదాన్ని పొందినట్లుకూడా ఈ పురాణం తెలియజేస్తున్నది.

**శ్రీరామవృత్తాంతం**

శ్రీరామచంద్రుడు సకలవానర సైన్యంతో వేంకటాద్రికి వెళ్ళి స్వామిపుష్కరిణిలో స్నానంచేసి, దాని ప్రభావం చేతనే రావణాది రాక్షసులను జయించి సీతాదేవిని తిరిగి పొందినట్లు భవిష్యోత్తరపురాణం తెలియజేస్తున్నది.

63. వ.పు I.39 1-52

64. వ.పు I .38 I-59

స్కాందపురాణం స్వామిపుష్కరిణీ ప్రభావాన్ని నిరూపించడానికి ధర్మగుప్త వృత్తాంతాన్ని చెబుతున్నది.

## ధర్మగుప్త వృత్తాంతం

పూర్వం చంద్రవంశంలో నందనుడనే మహారాజుండేవాడు. అతనికి ధర్మగుప్తుడనే పుత్రుడున్నాడు. ధర్మగుప్తునికి రాజ్యభారాన్ని అప్పగించి నందనుడు తపోవనాలకు వెళ్ళిపోయాడు. ధర్మాత్ముడైన ధర్మగుప్తుడు రాజ్యాన్ని చక్కగా పరిపాలిస్తున్నాడు.

ధర్మగుప్తుడొకసారి అడవికి వేటకు వెళ్ళాడు. వేటపూర్తయ్యే సరికి సాయంకాలమై చీకటిపడింది. రాజు సాయంకాల సంధ్యావందనంచేసి గాయత్రిని జపించాడు. ఇంతలో ఎక్కడినుంచో ఒకసింహం అతని వెంటపడింది. సింహంవల్ల భయపడి అతనొక చెట్టు నెక్కాడు. ధర్మగుప్తుడు ఆ చెట్టు వైపుకే పరిగెత్తి వస్తున్న భల్లూకాన్ని దాన్ని వెంబడించి వస్తున్న సింహాన్ని చూశాడు. భల్లూకం కూడా చెట్టునెక్కి–

"ఓ రాజా! నీవేమీ భయపడవద్దు? ఈ రాత్రికి ఇక్కడే విశ్రమించి రేపు దిగివెళ్లుదాం. నీవు సగం రాత్రిదాకా నిద్రపో? నేను మిగతా సగం రాత్రి నిద్రపోతాను" అన్నది.

రాజు అలాగే అని నిద్రపోయాడు. సింహం భల్లూకంతో ఇలా అన్నది– "రాజును నాకు ఆహారంగా క్రిందకు తోసివెయ్యి!" కాని భల్లూకం అలాచేయలేదు. అర్ధరాత్రి కావడంతోనే భల్లూకం నిద్రపోయింది. రాజు



మెలకువతో ఉన్నాడు. సింహ యధా ప్రకారం రాజును చూచి ఇలా అన్నది. "రాజా! ఈ భల్లూకాన్ని క్రిందకు తోసి నా కాహారా న్నివ్వు!" అన్నది. దాని మాటలకు రాజు భల్లూకాన్ని క్రిందకు తోసివేశాడు. భల్లూక రూపంలో ఉన్న ధ్యానకాష్ఠుడనే మహర్షి ద్రోహియైన ధర్మగుప్తుణ్ణి పిచ్చివాడివికమ్మని శపించాడు.

అలా పిచ్చివాడైన ధర్మగుప్తుణ్ణి రేవాతీరంలో తపస్సు చేసుకుంటున్న అతని తండ్రి నందుని దగ్గరకు తీసుకొనివచ్చి ఇతనికి మతి చెడిందని చెప్పారు. తరువాత నందుడు పుత్రుణ్ణి తీసుకొని జైమిని మహర్షి దగ్గరకు వెళ్ళి ఈ విషయాన్ని చెప్పగా "ధ్యానకాష్టుని శాపంవల్ల ఇతనికి ఈ పరిస్థితి కలిగిందని, సువర్ణముఖరీ నదీతీరంలో వేంకటాచలమనే పర్వతం ఉంది. దానిపైన గల స్వామిపుష్కరిణీ అనే తీర్థరాజ్యంలో స్నానం చేయిస్తే పిచ్చివెంటనే తగ్గుతుందని మహర్షి చెప్పాడు. నందుడు అలాగే చేయగా ధర్మగుప్తునికి పిచ్చిపోయి యథాస్థితి కలిగింది.[65]

## సుమతి వృత్తాంతం

పూర్వం మహారాష్ట్ర దేశంలో యజ్ఞదేవుడనే బ్రాహ్మణుడుండేవాడు. అతని కుమారుడు సుమతి. సుమతిదుష్ట ప్రవృత్తితో తండ్రిని, పతివ్రత అయిన భార్యను వదిలేసి వేశ్యాలోలుడైనాడు. బ్రాహ్మణత్వం నశించి సుమతి బోయవనిత ఇంట్లోనే ఉంటూ, ఎప్పుడూ ఆమెతోనే కాలక్షేపం చేస్తున్నాడు. అవసరాలకోసం దొంగతనాలు కూడా చేయడం మొదలుపెట్టాడు.

65. స్కాం.పు.3.I–62

ఒకరోజు బోయవాని వేషంలో అతడొక బ్రాహ్మణుణ్ణి చంపి అతని ధనాన్ని దోచుకున్నాడు. ఆ డబ్బును బోయవనితకు ఇవ్వడానికి వెళుతుండగా బ్రహ్మహత్య నల్లని గుడ్డలతో ఎర్రని జుట్టుతో అతణ్ణి వెంబడించింది. అలా బ్రాహ్మహత్య వెంబడిరాగా, దేశదేశాలన్నీ తిరిగి చివఱకు తన తండ్రి దగ్గరకువెళ్ళి రక్షించమని ప్రార్థించాడు. యజ్ఞదేవుడితో బ్రహ్మహత్య ఇలా అన్నది.

"నీ కుమారుడు దుర్మార్గుడు. అతణ్ణి నాకు వదలిపెట్టు". అని తండ్రి చూస్తుండగానే కొడుకును కొట్టింది, కొడుకు పడుతున్న ఆ బాధలను చూడలేక యజ్ఞదేవుడు అక్కడకు వచ్చిన దుర్వాసమునిని ప్రార్థించాడు, దుర్వాసుడు అతనితో ఇలా అన్నాడు.

"యజ్ఞదేవా! నీ పుత్రుడు మహాపాపి. నీ వాతణ్ణి మహాపవిత్రం, సకలపాప వినాశకరమైన వేంకటాచలానికి తీసుకెళ్ళి అక్కడ ఉన్న స్వామిపుష్కరిణిలో స్నానం చేయిస్తే బ్రహ్మహత్య క్షణంలో నశిస్తుంది."

యజ్ఞదేవుడు అలాగే తనకుమారుణ్ణి స్వామిపుష్కరిణిలో స్నానం చేయించగా ఆకాశవాణి "యజ్ఞదేవా! నీ పుత్రుడు పవిత్రుడైనాడ" ని పలికింది. తరువాత బ్రహ్మహత్యా దోషం పోయిసుమతికి మామూలు స్థితి వచ్చింది." [66]

**కాశ్యపవృత్తాంతం**

అభిమన్యుని కుమారుడు పరీక్షిత్తు హస్తినాపురాన్ని రాజధానిగా భారతభూమిని పరిపాలిస్తున్న రోజుల్లో ఒకసారి వేటకు వెళ్ళి తప్పిపోయిన ఒక మృగాన్ని వెదుకుతూ చాలా దూరం తిరిగి అక్కడి ఆశ్రమంలో ధ్యానంలోఉన్న శమీకమహర్షిని మృగాన్ని గురించి అడిగాడు.

66. స్కాం.పు. 4.1-44



యోగసమాధిలో ఉన్న ముని సమాధానం చెప్పలేదు, అడిగిందానికి సమాధానం చెప్పలేదనే కోపంతో బాణం మొనతో చచ్చిపోయిన పామునొక దాన్ని అతని భుజంపైన వేసి కోపంతో తన నగరికి వెళ్ళిపోయాడు. ఆ ముని కుమారుడు శృంగికి ఈ విషయం తెలిసి "నా తండ్రిపైన పామును పడేసినవాడు ఏడు రాత్రుల్లో తక్షకుని వల్ల మరణించాలి" అని పరీక్షిత్తును శపించాడు. శమీకుడు ఈ విషయాన్ని తెలిసికొని తన శిష్యుణ్ణి గౌరీముఖుణ్ణి పిలిచి ఈ వృత్తాంతాన్ని పరీక్షిత్తుకు తెలియజేయమని పరీక్షత్తువద్దకు పంపిస్తాడు. ఈ విషయాన్ని విన్న పరీక్షత్తు గంగానది మధ్యలో ఒంటిస్తంభం మేడను నిర్మించుకొని విష్ణు ధ్యానంచేస్తూ అందులో ఉంటాడు. ఆ సమయంలో మంత్ర శాస్త్రంలో గొప్ప నిష్ణాతుడైన కాశ్యపుడనే విప్రుడు తక్షకుడి నుంచి పరీక్షిత్తును రక్షించడానికి బయలు దేరాడు. తక్షకుడు బ్రాహ్మణవేషంలో వచ్చి అతని మంత్రశక్తిని పరీక్షించి దరిద్రుడైన అతనికి కావలసిన ధనాన్ని ఇచ్చి పంపేశాడు. ఇలా కాశ్యపుణ్ణి పంపి సర్పాలనన్నింటిని ముని వేషాన్ని ధరించమని చెప్పి, తను ఒక రేగి పండులో పురుగుగా ఉండి పరీక్షిత్తును కరవడానికి సిద్ధంగా ఉన్నాడు.

మునులందరు పరీక్షిత్తును దర్శించి రాజుకు పండ్లనిచ్చారు, పరీక్షిత్తు పండ్లనన్నింటిని మంత్రులకు వృద్ధులకు ఇచ్చి ఒక పెద్ద పండును తీసుకోగా ప్రజలకు రాజుకు అందులో ఒక పురుగు కనిపించింది. రాజు దానిని కంఠందగ్గర ఉంచుకోగా అది రాజును చుట్టుకొని కరచింది. మంత్రులు, పరీక్షిత్తు మరణానంతరం అతని కుమారుడు జనమేజయుడికి రాజ్య పట్టాభిషేకం చేశారు.

ఇలా రాజును తక్షకుని నుంచి తప్పించని కాశ్యపుడు సజ్జనులచేత దూషితుడై, ఎక్కడ ఆశ్రయం దొరక్క దేశాలన్నీ తిరిగి ఎక్కడా ఆశ్రయంలేక చివరకు శాకల్యముని దగ్గరకువచ్చి ఆయనను ఇలా ప్రార్థించాడు.

"మహర్షీ ! బ్రాహ్మణులు, పెద్దలు నన్ను నిందిస్తున్నారు. దయచేసి అందుకు కారణమేమిటో తెలియజేస్తారా? అందుకు శాకల్యముని ఇలా సమాధానం చెప్పాడు.

"నీవు విష్ణుభక్తుడు, మహాయోగి, శుకయోగివల్ల భాగవతాన్ని భక్తితో విన్నవాడు అయిన పరీక్షిత్తును రక్షించలేదు. అందువల్ల నిన్ను బ్రాహ్మణులు, సజ్జనులు దూషిస్తున్నారు. ఈ పాపం పోవడానికి నీకొక ఉపాయం చెబుతాను విను అని, "సువర్ణముఖరీ తీరంలో వేంకటాచలమని ప్రసిద్ధి పొందిన శ్రీమన్నారాయణుని నివసించే దివ్యపర్వతం ఒకటి ఉన్నది. అచట ఉన్న స్వామిపుష్కరిణిలో స్నానంచేసి వరాహస్వామిని దర్శించి స్వామిని సేవిస్తే నీ పాపాలన్నీ నశించిపోతాయి"

అప్పుడు కాశ్యపుడు వేంకటాద్రికి వెళ్ళి స్వామిపుష్కరిణిలో స్నానంచేసి స్వస్థచిత్తుడై అందరిచేత గౌరవం పొందాడు.[67]

**ఉపసంహారం**

పరమ ఉత్కృష్టమైన శ్రీవేంకటాచలంలో ఎన్నో పవిత్ర తీర్థాలున్నాయి. వాటి ప్రభావాన్ని పురాణాలు అనేక వృత్తాంతాలద్వారా నిరూపిస్తున్నాయి. అందరికి అందుబాటులో శ్రీనివాసుని ఆనందనిలయ విమానానికి దగ్గరలో ఉన్న తీర్థాలు కాక, ఎంతో దూరంలో భక్తులు వెళ్ళడానికి కూడా వీల్లేని

67. స్కాం.పు I. I. 93



ప్రదేశాల్లో కూడా ఎన్నో తీర్థాలున్నాయి. ఆ యా సందర్భాల్లో, ఆ యా విశేషదినాల్లో ఆ యా తీర్థాలను దర్శించినట్లైతే శ్రీనివాసుని కృప వుంటుందని చెప్పడంలో అతిశయోక్తి ఏమీ లేదు.

**స్వామిపుష్కరిణీ స్నానం వేంకటేశ్వర దర్శనమ్ ।**
**మహాప్రసాదస్వీకారః త్రయం త్రైలోక్యదుర్లభమ్ ॥.**[68]

* * *

68. భ.పు.రహస్యాధ్యాయమ్ శ్లో॥154.

1. శ్రీ వేంకటేశశతకం మద్రాసు 1970. – నరసింహాచార్య ముదుంబై

శ్రీ వేంకటాచలేతి హాసమాల 1987– నరసింహాచార్య ఎన్,సి.వి,తిరుపతి

తిరుపతి క్షేత్రసాహిత్య సమీక్ష తిరుపతి1980 – నాగభూషణం. రాంపల్లి.

శ్రీ వేంకటాచలమాహాత్మ్యమ్

ప్రస్తావన తిరుపతి 1991 – రఘునాథాచార్య ఎస్.బి.

తిరుపతి వెంకన్న – స్వామి కృష్ణదాస్ జీ.

తీర్థ ప్రశస్తి – డా.సి.లలితారాణి 1992 తిరుపతి

The Tirumala Temple 1981 - Ramesan. N Tirupati

Tirupati Srivenkateswara 1981 - Subrahmanya Sastri,S.Tirupati

History of Tirupati - Vira Raghavacharya, TkT.Tirupati

Golden jublee celebrations souvenir - T.T. Devasthanams Tirupati 1984

A study of Srivenkatachala Mahatyam with special reference to Varaha and Bhavisyottara Puranas - Dr.c.LalithaRao. R.S.V.P. 2012

* * *